
# ఈశావాస్యోపనిషత్



JAI SRIMANNARAYANA
2246
JET SRIKOSAM

...మహంస పరివ్రాజకులు

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామి వారు

అనుగ్రహించినది

శ్రీమన్నారాయణ రామానుజ యతిభ్యో నమః
ఓం అస్మద్గురుభ్యో నమః

# ఈశావాస్యోపనిషత్

పరమహంస పరివ్రాజకులు
శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ
జీయరుస్వామి వారిచే
సీతానగరం
వేద విశ్వవిద్యాలయ విద్యార్థులనుద్దేశించి
అనుగ్రహించబడిన ఈ ఉపనిషత్
ప్రవచనమును అక్షరరూపముగ అందించే
సాహసం చేస్తున్న

మీ

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్

**SRI RAMANUJAVANI SERIES - 31**

చతుర్థ ముద్రణము

RS 12-00

ప్రతులకు :

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్**

సీతానగరము, - 522 501

గుంటూరుజిల్లా - ఆంధ్రప్రదేశ్

✆ : 426929, 424053

**శ్రీ రామానుజవాణి**

29-1-26, శేషాద్రిశాస్త్రివీధి,

గవర్నరుపేట, విజయవాడ-2

ఫోన్ : 433040

D.T.P. : శ్రీరామానుజవాణి D.T.P. సిస్టమ్స్, విజయవాడ - 2, ఫోన్ : 433040.

# పీఠిక

మానవజీవితం బాహ్యాభ్యంతర సమన్వయంతో సాగాలి. బాహ్యంగా కర్మ, ఆంతరంగా జ్ఞానం కలిపి జీవిస్తే అది సుఖాన్ని శాంతిని ప్రసాదిస్తుంది. ఈ రహస్యాన్ని వేదం పూర్వభాగం ఉత్తరభాగం అనే రెండు భాగాలుగా విభజించి తెలియచేసింది. పూర్వభాగం కర్మ, ఉత్తరభాగం జ్ఞానం. ఈ జ్ఞానం కర్మకు విరుద్ధమని కర్మాచరణం చేసినవారు జ్ఞాననిష్ఠలో ఉండలేరని, జ్ఞాన నిష్ఠ కలవారు కర్మనాచరించరాదని కొందరి అభిప్రాయం. అది కాదంటుంది ఈశావాస్యోపనిషత్. ఈ ఉపనిషత్ శుక్లయజుర్వేదం సంహితాభాగంలో ఉన్నది. ఈ మంత్రాలే బృహదారణ్యకంలో కన్పిస్తాయి. కర్మకి, జ్ఞానానికి, త్యాగానికి, భోగానికి సమన్వయాన్ని నిర్దేశించిన ఉపనిషత్. జ్ఞానమంటే కేవలం నిర్వ్యాపారత కాదు. జ్ఞానమనగానే దేనిని? ఎవరు? ఎట్లు? అనే ప్రశ్నలుదయిస్తాయి. భగవంతునిగూర్చి తననుగూర్చి తాను భగవంతుని చేరుటకు ఉపాయాన్ని గూర్చి ఫలాన్ని గూర్చి ఎఱుంగుటయే జ్ఞానం. భగవంతుని తెలుసుకొనుట అంటే, ఏమి గుణాలు రూపము లేనివాడని తెలుసుకొనుట కాదు. సృష్టికి కారణమైన ఆ భగవత్తత్వాన్ని తెలుసుకోవడ మంటే ఈ ప్రకృతి కంటే పురుషుని కంటే వేరని అది సర్వజగత్కారణమని సర్వగుణములకు ఆకరమని గుర్తించడమేగాని, వేరుగాదు. జీవుని ఎఱుంగుట అంటే తాను భగవానునికి చెందినవాడనని తానుచేసే ప్రతిపని వాని ప్రేరణచేత వానికొఱకే చేస్తు

న్నానని తెలుసుకొనడం. ఈ రెండు విధాలయిన జ్ఞానాలు కల్గితే కర్మ, అనగా తానుచేసే ఏ వ్యాపారమయినా వాడు వానికొఱకు జీవుని చేత చేయించుకొనేదేకాని తాను తనకొఱకు చేయడంకాదు. ఇది తెలిస్తే చేసేపని తనదని చేసేవాడు తానని, చేసినందువల్ల కలిగే ఫలం తనదని అనుకొనే అజ్ఞానం తొలిగిపోతుంది. ఇదే త్యాగం. ఇపుడు ఆ కర్మ బంధకం కాదు. తానుచేసేది కర్మకాదు. అది సేవ. అది తనకు సహజము. దీనిని తెలుసుకొని శరీరంలో కర్మచేయడం మానవుడు నేర్చుకోవాలి. ఆనాడు ఇక్కడ అక్కడ ఎక్కడైనా జీవుడు ఆనందంగా ఉంటాడు. అనే రహస్యాన్ని ఈశావాస్యం అందించింది.

సమాజంలో శాంతిని కర్మనిష్ఠని ప్రేమను పెంపొందించాలనే కోరికతో శ్రీ చిన్నజీయరుస్వామివారు ఈశావాస్యోపనిషత్‌ను సరళము సుగమము అయిన భాషలో వివరించారు. ఇది జీవితం సుఖ శాంతులతో నడవాలని కోరుకునే ప్రతి వ్యక్తి చదవాలి. లోకోపకారానికై శ్రీ జీయరుస్వామివారు తెలుగులో అందించిన ఈ ఉపనిషత్తును శ్రీ రామానుజ వాణి మీ కందిస్తోంది. అందరూ చదివి తరింతురు గాక!

ఇట్లు
శ్రీ భాష్యం అప్పలాచార్యులు

ఓం అస్మత్ గురుభ్యో నమః

# ఈశావాస్యోపనిషత్

## ఆముఖమ్

భగవానుడు అంటే ఎవరు? అనే ప్రశ్నకి ఉపనిషత్తులు సమాధానం చెప్పాయి. "మనం" అంటే పైకి కనిపించే శరీరం కంటే లోపల చైతన్యం కలిగిన పదార్థం. అది వుండడం చేత శరీరం జీవిస్తోంది. కనుక దానికి "జీవుడు" అని పేరు. ఏ శరీరంలో తానుంటే ఆ శరీరం అంతటా తన జ్ఞానంతో వ్యాపించి ఒక మూల తానుంటుంది కనుక దానికి "ఆత్మ" అని పేరు. ఈ ఆత్మ శరీరంలో స్వతంత్రముగా ప్రవర్తించడం లేదు, శరీరమైనా తను స్వతంత్రించి ప్రవర్తించడంలేదు. ఆత్మ వుండకపోతే శరీరమూ వుండటంలేదు. ఆత్మ, తను కోరుకుని ఇందులో ఉండటంలేదు. శరీరం అచేతనంగా కనిపిస్తోంది ఆత్మ లేనప్పుడు. ఆత్మ, తాను ఇందులో వున్నప్పుడు దీన్ని నడిపిస్తోంది. ఇందులోంచి బయటపడ్డ తరువాత ఏమవుతుందో మనకి తెలియదు. కనుక ఏమిటి శరీర తత్వం? ఏమిటీ ఆత్మ తత్వం? ఈ రెండిటినీ నడిపించే తత్వము ఏది? అనే ప్రశ్నలకి ఉపనిషత్తులు సమాధానం చెప్పాయి. ఉపనిషత్తులు అంటే వేదంలో వుండే రెండవ భాగం.

మన ఇంద్రియాలకి గోచరించే వాటిని ప్రత్యక్షం అంటాము. కనిపించిన వాటిని బట్టి కొన్నిటిని ఊహిస్తాం. అలాకలిగే జ్ఞానానికి "అనుమానం" అని పేరు. ఈ ఆత్మ కానీ, పరమాత్మకానీ ఏమిటి అనే ప్రశ్నకి జవాబుని మన ఇంద్రియాలు చెప్పలేవు. ఊహకే అందటం లేదు. ఈ రెండిటికి అందనివాటిని చెప్పేది

ఏదో దానికి 'వేదం' అని పేరు. ఇది రెండు భాగాలు. ఇందులో పూర్వభాగం "సంహితా" అంటాము. అది "శరీరముతోటి ఈ లోకంలో అనుభవించేటటువంటి, ఈ శరీరము వదలిన తరువాత పై లోకంలోకి వెళ్ళి అనుభవించేటటువంటి సుఖములను గూర్చి వివరిస్తుంది. ఆ సుఖములు పొందటానికి చేయవలసినటువంటి అనుష్ఠానములు, యజ్ఞయాగాది కార్యక్రమముల గురించి వివరిస్తుంది. రెండవభాగం ఈ శరీరంతో సుఖం అనుభవించే ఆత్మ ఏమిటి? పరమాత్మ అంటే ఎవడు? వానికి, ఈ ఆత్మకి ఉండే సంబంధమేమి? ఇరువురూ నివసించే ఈ శరీరము యొక్క స్వరూపమేమి? జీవుడు ఎందుకు తనకి తానుగాని, పరమాత్మనిగాని తెలిసికొనలేక పోతున్నాడు? ఎలా వానిని తెలుసుకోవాలి?, తెలుసుకొని వానిని పొందడానికి తానేం చేయాలి? ఇక్కడ వున్నప్పుడు వాడ్ని ఏ విధంగా ప్రార్థన చేయాలి? ఈ విషయములన్నీ తెలిపేది ఏదో దానికి "ఉపనిషత్" అనిపేరు. అది వేదములలో రెండవ భాగమన్నమాట. ఇది పెద్దలద్వారా, జిజ్ఞాసువు అయిన వ్యక్తి ప్రార్థించి ఉపదేశ రూపముగా పొందవలసినది తప్ప, రుచిలేని వాడికి చెప్పదగినది కాదు. కనుక దీనికి "ఉపనిషత్" అని పేరు. పూర్వభాగం అని చెప్పబడే భాగంలో మనయొక్క శారీరక సుఖములకోసం చేసేటటువంటి యజ్ఞయాగాదులచేత ఆరాధించబడే కొందరి దేవతల పేర్లు చెప్పబడతాయి. ఆయా దేవతలు అంతా స్వతంత్రులా? వారంతట వారే ఇవ్వగలరా? కోరినటువంటివాటిని? అనేవాటికి వేదంలోనుండి ఉపనిషత్ భాగం సమాధానం చెబుతుంది. ఆయా దేవతల అంతర్యామిగా వుండి, మనం చేసేటటువంటి యజ్ఞయాగాదులని స్వీకరిస్తూ, తన, మన స్వరూపాన్ని ప్రకాశింపచేసేటటువంటి వాడు 'భగవానుడు.' వానికి ఆత్మ, వానికే పరమాత్మ, పరంబ్రహ్మ, పరంజ్యోతి ఇత్యాది నామాలు వున్నాయి అని ఉపనిషత్ భాగం మనకి వివరిస్తూ వుంటుంది.



ఆ ఉపనిషత్తులూ అనేకం ఉన్నాయి. ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క "ఉపనిషత్", ఋగ్, యజుస్సామాది వేదాలలో వాటికుండేటటువంటి ఈ ఆత్మ, పరమాత్మ తత్వాన్ని తెలిపే భాగాలకి ఉపనిషత్ భాగాలని పేరయితే, కృష్ణయజుర్వేదంలో ఒక భాగమైన శుక్లయజుర్వేదానికి ఉండే ఉపనిషద్ భాగాలలో చేరినటువంటిది, "ఈశావాస్యమనే" ఒక ఉపనిషత్. దీనిని ఉపనిషద్‌లలో అన్నిటికి ప్రథమముగా మనవారందరూ స్వీకరిస్తారు కారణం? ఆ భగవానుడు ఎలా వుంటాడు? మొదలగు అతనికుండే అనేక అసాధారణ ధర్మాలు స్పష్టముగా తెలియజేసే "ఉపనిషద్" ఇది అవడం చేత. భగవంతుడు అంటే అంతటా వ్యాపించి యుండాలి. అన్నిటి యందూ వాడుండాలి అన్ని వేళలా వుండాలి. అందరినీ తనలో కలిగి వుండాలి. అందరిలో తానుండాలి. అందరికంటే మించిన సుందరుడై యుండాలి. ఏదికోరితే దానిని ఇవ్వగలిగినవాడై యుండాలి. ఇవన్నీ ఆ భగవానుడికి వున్నాయి, అని మనకి తెలిపే ఉపనిషత్ "ఈశావాస్యోపనిషత్" దీనిని శుక్ల యజుర్వేదంలో "కాణ్వశాఖీయుల" చేత పదునెనిమిది మంత్రములుగా అనుసంధింపబడే క్రమాన్ని అనుసరించి మనం ఇపుడు నేర్చుకుందాం. మంత్రాన్ని నేర్చుకునేటప్పుడు ముందర శాంతిని పఠిస్తాం. దానికి ముందు ఆచార్యస్మరణ చేస్తాం. ఆచార్య స్మరణ పూర్వకముగా శాంతి మంత్రమును పఠిస్తూ ఉపనిషత్‌ను అనుసంధిద్దాం.

మీ

**శ్రీరామానుజవాణి**

"ఓం అస్మత్ గురుభ్యో నమః"

ఓం పూర్ణమిదం పూర్ణమదః
పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ
పూర్ణమేవావ వశిష్యతే,

ఓం ఈశావాస్యమిదగ్ం సర్వం
యత్ కించ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథాః
మా గృధః కస్యస్విద్ధనమ్॥

కుర్వన్నేవేహ కర్మాణి
జిజీవిషేత్ శతగ్ం సమాః।
ఏవం త్వయి నాన్యథేతోస్తి
న కర్మ లిప్యతే నరే॥

అసుర్యా నామ తే లోకాః
అన్ధేన తమసా వృతాః।
తాంస్తే ప్రేత్యాభిగచ్ఛని
యేకే చాత్మహనో జనాః॥

అనేజ దేకం మనసో జవీయో
నైనద్దేవా అప్నువన్ పూర్వ మర్షత్।
తద్ధావతో2న్యానత్యేతి తిష్ఠత్
తస్మిన్నపో మాతరిశ్వా దధాతి॥



తదేజతి తన్నైజతి
తద్దూరే తద్వదన్తి కే।
తదంతరస్య సర్వస్య
తదు సర్వస్యాస్య బాహ్యతః॥

యస్తు సర్వాణి భూతాని
ఆత్మన్యేవాను పశ్యతి।
సర్వభూతేషు చాత్మానం
తతో న విజుగుప్సతే॥

యస్మిన్సర్వాణి భూతాని
ఆత్మైవాభూ ద్విజానతః।
తత్ర కో మోహః కః శోకః
ఏకత్వ మను పశ్యతః॥

స పర్యగా చ్ఛుక్రమకాయ మవ్రణం
అస్నావిరం శుద్ధమపాప విద్ధమ్।
కవిర్మనీషీ పరిభూః స్వయమ్భూః
యాథాతథ్యతో2ర్థాన్ వ్యదధా చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః॥

అన్ధం తమః ప్రవిశన్తి
యే2విద్యాముపాసతే
తతో భూయ ఇవతే తమో
య ఉ విద్యాయాం రతాః॥

అన్య దేవాహుర్విద్యయా
అన్యదాహు రవిద్యయా।
ఇతి శుశ్రుమ ధీరాణాం
యే నస్త ద్వ్యాచచక్షిరే॥

విద్యాంచా విద్యాంచ
యస్తద్వేదోభయగ్ం సహ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా
విద్యయా2మృతమశ్నుతే॥

అన్ధం తమః ప్రవిశన్తి
యే2సంభూతిముపాసతే।
తతో భూయ ఇవ తే తమో
య ఉ సంభూత్యాం రతాః॥

అన్యదేవాహుస్సంభవాత్
అన్యదాహు రసంభవాత్।
ఇతి శుశ్రుమ ధీరాణాం
యే నస్త ద్విచచక్షిరే॥

సంభూతించ వినాశంచ
యస్తద్వేదోభయగ్ం సహ।
వినాశేన మృత్యుం తీర్త్వా
సంభూత్యామృతమశ్నుతే॥



హిరణ్మయేన పాత్రేణ
సత్యస్యాపిహితం ముఖమ్।
తత్వం పూషన్నపావృణు
సత్య ధర్మాయ దృష్టయే॥

పూషన్నేకర్షే! యమ! సూర్య! ప్రాజాపత్య!
వ్యూహరశ్మీన్ సమూహ తేజః
యత్తేరూపం కల్యాణతమం తత్తేపశ్యామి
యోసావసౌ పురుష సోఽహమస్మి

వాయురనిల మమృతం
అథేదం భస్మాన్తం శరీరమ్।
ఓం క్రతో! స్మర, కృతం స్మర
క్రతో! స్మర కృతం స్మర॥

అగ్నే! నయ సుపథా రాయే అస్మాన్
విశ్వాని దేవ! వయునాని విద్వాన్
యుయోధ్యస్మత్ జుహురాణ మేనః
భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ॥

"ఓం అస్మత్ గురుభ్యో నమః"

# ఈశావాస్యోపనిషత్

## -: శాంతి మంత్రము :-

పూర్ణమిదం పూర్ణమదః - పూర్ణాత్పూర్ణ ముదచ్యతే।
పూర్ణస్య పూర్ణమాదాయ - పూర్ణమేవావ శిష్యతే॥

ఈశావాస్యోపనిషత్‌కు ముందు అనుసంధించవలసిన శాంతి మంత్రం "పూర్ణమిదం పూర్ణమదః" అనేది. ఈ ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడే విషయాన్ని అంతటిని సూక్ష్మంగా మనకి ఈ మంత్రం తెలియజేస్తుంది. భగవంతుడు అంటే ఎలా ఉంటాడు? అది మనకి ముందు తెలియాలి. భగవంతుడంటే ఎప్పుడు, ఎక్కడ, ఎలా తానున్నా, తాను తానుగానే వుండాలి. ఎంత మనకి ఇచ్చినా తరగనివాడై యుండాలి. అన్నీ ఇవ్వగలిగిన వాడై యుండాలి. కొంత ఇచ్చిన తరువాత, ఈ రోజుకిక అయిపోయింది రేపు రండి, అనేవాడు కాకూడదు. అంటే ఎన్నెన్ని రకాలుగా తనని ఆశ్రయించిన వాళ్ళకి ఇవ్వవలసివుంటుందో అన్నీ కూడ తాను ఇవ్వగలిగిన వాడై యుండాలి. అంటే అన్ని వస్తువులతోటి తాను నిండివుండాలి. ఇవ్వడానికి తగిన ఉదారత కలిగి వుండాలి. ఇచ్చేటటువంటి జాలిగుండె కలిగినవాడు కావాలి. ఇవన్నీ ఉంటాయా భగవంతుడిలో? ఇన్నివున్నలాభమేమి? ఎక్కడో అందకుండ ఆ మూల ఎక్కడో కూర్చొనివుంటే లాభంలేదు. కనుక మనకి దగ్గరి వాడైవుండాలి. దగ్గరివాడైయుంటే పాపం! చేతకాని వాడేమో? అనిపించక ఎవ్వరికీ లేనంత గొప్పతనం కలిగివుండాలి.



గొప్పతనాన్ని 'పరత్వం' అంటారు. మనకి దగ్గరగావుండి, అందుతూవుండటాన్ని 'సౌలభ్యం' అంటారు. అందుచేత పరత్వము, సౌలభ్యము అను రెండు గుణములు కలిగి, ఎవడిలో ఎంతిచ్చినా తరగనటువంటి 'పూర్తి' వుంటుందో ఆయన 'భగవానుడు'. మనచేత ఉపాసించదగినవాడు అవుతాడు. అలాంటి భగవంతుడు ఎన్ని రకాలుగా వుంటాడు? చాలా గొప్పవాడై యుండేవాడు. మనదాకా ఎట్లా వస్తాడు? అనేది ముందు మనకి తెలిస్తేతప్ప వాడ్ని ఆరాధించలేము. కనుక ఈ శాంతి మంత్రం ముందర భగవత్ స్వరూపాన్ని మనకి తెలియజేస్తుంది.

"భగవంతుడు పూర్ణుడు" అంటే నిండివున్నవాడు అని అర్థం. వేటితో? అన్నింటితో. కొన్ని పదాలకు, ఉదాహరణకు "అమ్మా" అనగానే ఎవరికి? "అన్న" అనగానే ఎవరికి? అన్న ప్రశ్న వస్తుంది. వీటిని "స సంబంధిక" శబ్దాలు అంటారు. రాముడు అంటే ప్రశ్నేం రాదు కదా! సీత అంటే ప్రశ్నేం రాదుకదా! కానీ తల్లి, తండ్రి, అన్న, చెల్లి, తినెను, చేసెను., ఇలాంటి పదాలకి వెంటనే ప్రశ్న వస్తుంది. "తినెను" అంటే ఏమి తినెను? "చేసెను" అంటే ఏమి చేసెను? ఎవరు చేసెను? ఎక్కడ చేసెను? ఎప్పుడు చేసెను? ఇలాగ కొన్ని ప్రశ్నలు వస్తూవుంటాయి. "పూర్ణుడు' ' అనగానే "వేటితో" అని వెంటనే ప్రశ్న వస్తుంది. అన్ని వస్తువులతో, గుణములతో కూడా ఎప్పుడు పూర్ణుడు? ఎక్కడ పూర్ణుడు? ఎలా పూర్ణుడు? వెంటనే మరొక ప్రశ్న. వీటికి సమాధానం చెబుతోంది మనకి శాంతిమంత్రం.

మొదట మనకి భగవంతుడు, ఎట్లా వుంటాడో తెలియదుకానీ ప్రపంచమంతటా ఉన్నట్టే మనలో కూడ నిండివున్నాడు. లోపల వాడున్నాడు కనుక మనం జీవించి ఉన్నాము కొంతమందిని మనం చూస్తూవుంటాం. 'పాపం పోయాడండీ'

అంటారు. ఇది వరకు చూసిన వాడే అక్కడ పడివున్నాడు కానీ, పోయినవాడు ఎవడో, అందులోంచి లేచిపోయిన తరువాత మనం ఊహిస్తాం.

ఓహో! ఇంతకు ముందు ఇందులో ఒకడున్నాడు కాబోలునని. అంటే మనం ఈవేళ కదులుతున్నామంటే మనలో ఒకడున్నాడన్నమాట. ఇప్పుడు లోపల వున్నాడు. అంటే ఎంత దగ్గరగా వున్నాడన్న మాట? చాలా దగ్గరగా వున్నాడు. ఏం చేస్తున్నాడు దగ్గరగా వుండి? లోపలవుండి మనల్ని నడిపిస్తున్నాడు. శాసిస్తున్నాడు అని కదా అర్థం. వాడి శాసనాన్ని బట్టే మనం నిద్ర మేల్కొంటున్నాం. వాడు పడుకోబెడితే పడుకుంటున్నాం. పడుకున్నాక, మరి లేవద్దంటే కొందరు లేవడంలేదు. అలావున్నవారికి ప్రక్కవారు లేపేస్తున్నారు. లోపల వుండి లేపేవాడు తను. నడిపేవాడు తను, భావములు పుట్టించేవాడు తను, మాటలాడించేవాడు తను. కదలిక కలుగుతోంది వాడి వలన. కనుక వాడు లోపల వుండి కదుపుతున్నాడు, శాసిస్తున్నాడు.

శాసించడాన్ని "యమ" అంటారు సంస్కృతంలో లోపల నుండి "అంతః", "యమ" నియమిస్తున్నాడు గనుక వాడిని "అంతర్ యామి" అని పిలుస్తారు. ఇక్కడ అంతర్యామిగ ప్రతి అణువణువునా ఉన్నాడు. వుండి చేతగానివాడై యున్నాడా? కాదు "పూర్ణమిదం", "ఇదం" "ఇది" అంటూ మన ప్రక్కన ఉండేదాన్ని చూపిస్తాం కదా. ఇది పరిపూర్ణమే. ఇది భగవంతుని స్వరూపం. అయితే ఇక్కడ వుండేవాడు ఎక్కడివాడు? "అదః పూర్ణం" ఆగమ గ్రంధాలలో తనకంటూ "పర వాసుదేవుడు" అనే పేరుతో "పరమ పదం" అనే ఒక చోటు వున్నదని చెబుతోంది. అక్కడ తాను పూర్ణుడే. ఇక్కడ ఎంత పూర్ణత వుందో, అక్కడ అంత పూర్ణత వుంది. అయితే



ఇక్కడ, అక్కడ మాత్రమే వుంటాడా? కాదు. "పూర్ణాత్ పూర్ణముదచ్యతే "పూర్ణాత్" పరమపదంలో పరవాసుదేవుడే" "పూర్ణాత్ పూర్ణం" ఆ పర వాసుదేవుడులోంచి ఒక పూర్ణంగా ఈలోకంలోకి దిగి వస్తాడు దానిని వ్యూహమంటారు. ఇది నాలుగుగ ఉంటుంది. "వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ" అనే నాలుగూ 'వ్యూహములు' అని అంటారు. "వాసుదేవ" అనేది ప్రధాన వ్యూహం గా ఉంటుంది. అందులోనుండి సృష్టి స్థితి, లయలను చేయడంకోసమని, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అనే వ్యూహములుగా తానేర్పడి ఆయాపనులు చేస్తూ వుంటాడు.

అక్కడక్కడ వున్నప్పటికి అవి పరిపూర్ణ రూపాలే. ఆ తరువాత ఏం అవుతుంది? "పూర్ణస్య పూర్ణమాదాయ" ఆ వ్యూహంలోంచి ఒక్కొక్క, ఒక్కొక్క కాలానికి ఒక్కొక్క అవసరానికి తగినట్టుగా ఒక్కొక్క రూపాన్ని ఈ లోకంలోకి పంపిస్తాడు. తద్వారా ఆయనలో వుండే గుణములు ఒక్కొక్కటీ తెలుస్తాయి. గుణములు గూడ ఒక సంపద కదా! సంపదని సంస్కృతంలో "విభూతి" అంటారు. "విభూతిర్భూతిరైశ్వర్యం" విభూతి, భూతి, ఐశ్వర్యం అనే పదాలకి 'సంపద' అని నిఘంటువు చెప్తోంది. కనుక అవతారముల ద్వారా గుణములు ఒక్కొక్కటి ఎలా ఎలా పని చేస్తాయో తెలుస్తాయి కనుక గుణ సంపద తెలుస్తుంది అది "విభవ అవతారం" అంటారు. అలాంటి విభవ అవతారములను బట్టే మనం భగవంతుని, ఒక్కొక్క రకమైన విగ్రహంగా ఆరాధన చేస్తాం. కనుక వ్యూహరూపమైన పూర్ణమునుండి "పూర్ణం ఆదాయ" బయలుదేరిన 'విభవ అవతారాన్ని' మనం ఆధారముగా చేసుకొని ఆరాధించడానికి తగినట్టుగా నువ్వు కోరుకున్న ఒక రూపంలో నువ్వు ఏర్పరచిన ఒకలోహాన్ని, ఒక వస్తువుని, తన దేహముగా చేసి

కొని అందులోకూడ పరిపూర్ణుడే అయివుండి నీకు అందుతాడు. "పూర్ణమేవ అవశిష్యతే" పూర్ణముగా ఉండేటటువంటి భగవద్రూపమే నీ కోసమని నిలచి వుంటుంది, నీవు సేవించడానికి తగినట్టుగా. ఇందులో ఇక్కడున్నా పరిపూర్ణుడే కనుక నీ కంటికి ప్రకాశించు రూపము అని, "అర్చా" అని అంటారు.

కనుక ఇప్పుడు భగవంతునికి రూపాలు ఎన్ని, ఒకటి అంతర్యామిగ ఇక్కడ వుంటాడు. రెండు పరవాసుదేవుడై వుంటాడు ఆ పరమపదంలో. మూడు వ్యూహముల్లో తానుంటాడు. నాల్గవది అవ్యూహాలలోనుండి వచ్చే విభవావతారము. విభవావతారమును బట్టి మనచే అర్చించబడే "అర్చా మూర్తి" ఐదు. ఈ ఐదింటిలోనూ తను పరిపూర్ణుడై. వుంటాడా అలాగ? ఒక దాంట్లోంచి ఒకటి వస్తే తగ్గిపోదా కాంతి శక్తి? తగ్గదు. ఎలా? వెలిగించి పెట్టాము ఒక దీపాన్ని అక్కడ. అందులోంచి మరొక దీపాన్ని వెలిగించి పెట్టాము. ఆ ప్రక్కన అందులోంచి మరొక దీపాన్ని వెలిగించాము. ఇలా నాల్గవసారి వెలిగించిన దీపం, మొదటి దీపంలోంచి వచ్చిన దానిని గద దానికంటె తర్వాతిదానిని గద అని తక్కువగా వెలుగుతుందా? కానేకాదు. మొదటి దీపానికి ఎంత కాంతి, తేజస్సు వుంటుందో, రెండవదానికి అంతే. అందులోనుండి వచ్చిన మరొక దానికీ అంతే. అందులోనుండి వచ్చిన మరొక దానికీ అంతే. ఇలా ఎన్ని వచ్చినా ప్రతిదాని కాంతి, శక్తి మిగిలిన వాటికి ఎట్లా వుంటాయో అలాగే భగవానుడు కూడ పరమపదంలో వున్నా, ఇటు అంతర్యామిగా వున్నా, అటు వ్యూహంలో వున్నా, విభవంలో వున్నా, మన ఎదురుగా విగ్రహంలో అర్చామూర్తిగా వున్నా, తనలో వుండే గుణపూర్ణతకీ ఎటువంటి లోపం ఉండదు కనుక నువ్వు ఆశ్రయించాలంటే భగవంతుడ్ని ఎక్కడ గుర్తించగలవు? లోపల గుర్తిస్తావా? చేతగాదు, పరమపదానికి ఎగురుదామా? లాభం



లేదు. వ్యూహం దగ్గరకు వెళ్ళి చూద్దామా, వెళ్ళలేము. పోని వ్యూహానికి వెడదామా, కాలం గడచిపోయింది. కనుక నీవు ఇప్పుడు ఆశ్రయించతగినచోటేది? అర్చామూర్తి. అయితే అర్చామూర్తి అంటే బొమ్మ కదండి, అనిపించకూడదు. కారణం ఇది కూడ పూర్ణుడే. నీ మనస్సులో ఆ "పూర్ణుడు" అనే విశ్వాసం నిండివుంటే, తాను నీకు ఇక్కడే కావలసిన కోర్కెలు అన్నీ తీర్చుతాడు. నీ మొరలు అన్నీ వింటాడు. నీకున్న ఆటంకాలు తొలగిస్తాడు. నీవు కోరినవన్నీ తాను ప్రసాదిస్తాడు. కనుక ఆశ్రయించదగినచోటు అర్చామూర్తి అనంటూ ఈ మంత్రం, ఈ అర్చామూర్తిగా వుండే భగవంతుని యొక్క స్వరూప, స్వభావములు ఏమిటి? వానిని ఎలా పూజించాలి? ఏ రకంగా మనం ఆరాధించాలి? అనే వాటిని గూర్చి ఈ ఉపనిషత్తులో మొదటి మంత్రం తెలియచేస్తోంది.

## 1వ మంత్రము:

**ఈశావాస్యం ఇదం సర్వం - యత్ కించ జగత్యాం జగత్।**
**తేన త్యక్తేన భుంజీథాః - మాగృధః కస్యస్విద్ధనమ్॥**

"జగత్యాం" ఈ జగత్తులో "జగత్" పరిణమించే స్వభావం కలిగి, "యత్ కించ" ఏ కొద్ది అయినా సరే ఉన్నదో, మన చేత గుర్తించబడుతున్నదో అదంతా ఎట్లాగున్నది? "ఈశావాస్యం" "ఈశ్" అంటే నియమించుట అని అర్థం. నియమించే స్వభావం కలిగినటువంటి ఒకనిచేత 'వాస్యం' వ్యాపించబడి యున్నది. "వస్‌నివాసే" అని సంస్కృతంలో ఒక ధాతువు. నివసించుట అని అర్థం. ఇది రెండు రకములుగా వుంటుంది. భగవంతుడు ఈ జగత్తును అంతా ఎట్లా శాసిస్తున్నాడు? అని అడిగితే ఆ "వాస్యం" అనే ధాతువు చాలా అందంగా వివరిస్తుంది. "వాస్యం" నివసింపచేయబడుచున్నది. ఎలాగ? వాడు వీటన్నిటి

లోపల ఉండటంవలన, అట్లే వాస్యం ఆతనిచేత ఈ జగత్తు, అంతా వ్యాప్తమై యున్నది. అంటే వీటన్నిటిబయటవాడుండి, వీటిని తనతో ధరించినాడు.

కనిపించే, కనిపించని ఏయే పరిణామ శీలమైనటువంటి వస్తువులున్నాయో వాటన్నిటికి లోపల తానున్నాడు. వాటన్నిటికి బయట తానున్నాడు. వుండి, వీటన్నిటినీ కూడా తాను శాసించుచున్నాడు పరమాత్మ, అని మనకి ఈ మంత్రం తెలియజేస్తోంది. లోపల బయట వ్యాపించుట అనే ఒక అందమైన గుణం కలిగి వున్నాడన్న మాట. వీటిలో ఎందుకు వ్యాపించాలి? వానికి దయవుంది కనుక. అయితే ఇందులో వుండే జీవులు చాలా తప్పులు చేస్తారే? అవును. అయినా "పోనీలే" అని వాటన్నిటిని ఓర్చుకొనే క్షమాగుణం వున్నది కనుక. లోపల బయటవుండే వాడు కనుక లోపల వుంటే చాలా దగ్గరగా వుంటాడు. బయట అంతా వ్యాపించివుంటే చాలా గొప్పవాడై యుంటాడు. కనుక పరత్వం, సౌలభ్యం అని మనం ఇంతకు ముందు చెప్పుకున్న గుణములు రెండూ వచ్చాయి. తప్పులు చూసినా పోన్లే అనే క్షమించే గుణమున్నది కనుక ఆయనలో దయ, వాత్సల్యాది గుణములున్నాయి. వీరందరికి ప్రభువు కనుక ఆయనలో "స్వామిత్వమనే" గుణమున్నది ఆయనలో దయ, వాత్సల్యాది గుణములున్నాయి. ఇలాంటి గుణములు కలిగి వీటిని నియమిస్తూ ఉండే "ఈశా" సర్వనియంతయైన పరమాత్మచేత "వాస్యం" ఇది అంతా వ్యాప్తమయినది. అంటే బయట వున్నాడని అర్థం 'ఈశా' పరమాత్మచేత "వాస్యం" ఇది అంతా వ్యాపింప చేయబడినది. అంటే లోపల వున్నాడని అర్థం. ఇంకొక అర్థం కూడా ఉన్నది. "వస ఆచ్ఛాదనే" అని సంస్కృతంలో మరొక ధాతువు. మనం, వస్త్రం, అంటున్నామే ఏమిటి దీనికి అర్థం "వస్" మనపైన కప్పబడి వుండి, "త్ర" మన శరీరాన్ని రక్షిస్తూవున్నది కనుక దీనికి వస్త్రం అనిపేరు.



కనుక "వస్" అంటే ఆచ్ఛాదించుట అనిఅర్థం. ఈశావాస్యం, ఈ పరమాత్మచేత ఈ జగత్తు అంతా కూడ ఆచ్ఛాదించబడివుంది. అనగా పరమాత్మ దీనినంతటిని ఆచ్ఛాదిస్తున్నాడు. పైనఉండి కాపాడుతున్నాడు. "ఈశా" పరమాత్మ చేత ఈ జగత్తు అంతా కూడా "వాస్యం" వస్త్రమువలె ఆతని యందు ఆచ్ఛాదించబడియున్నది. ఎలా వుందో చూడండి అర్థం. ఈ జగత్తును అంతా వస్త్రమువలె తనపై పెట్టుకున్నాడన్నమాట. వస్త్రం ఎవరికోసం వుంటుంది. వస్త్రం వస్త్రం కోసమా, మన కోసమా? వస్త్రం కోసం కాదు మనకోసమే. మనం పెట్టినట్టువుంటుంది. మనం చెప్పినట్టు వింటుంది. మనకోసం పనిచేస్తుంది. మన ఆధీనంలో వుంటుందే, ఈ జగత్తు అంతా కూడ పరమాత్మకి వస్త్రమువలె వున్నది కనుక, పరమాత్మకి చెందినది, పరమాత్మ చెప్పినట్టు నడిచేది, పరమాత్మకోసమే నడిచేది తప్ప స్వతంత్రమైనది, తనకోసమైనదీ కాదు అని ఈ మంత్రం జగత్తు పరమాత్మకి స్వాధీనమైనది అని పరమాత్మకై ప్రవర్తించాలని చేప్తోంది. ఇక్కడ జగత్తు అంటే జీవులు, జీవులు వుండటానికి అవకాశం కల్పించే శరీరాలుగా మారినటువంటి అచేతన వస్తువులుకూడ అని అర్థం.

అర్థాత్, చేతన అచేతన మయమైనటువంటి జగత్తు అంతా కూడా పరమాత్మకి చెందినది ఇది గుర్తించండి ముందు.

"యత్ కించ జగత్యాం జగత్" ఈ పరిణామ శీలమైనటువంటి ప్రపంచంలో ఏయే వస్తువులు అయితే వున్నాయో వాటన్నిటినీ కూడా "భుంజీథాః" అనుభవించండి. మీ, మీ యోగ్యతకి, మీ మీ అవసరానికి తగినట్టుగా వాటిని పొందండి తప్పులేదు. కానీ ఎట్లా పొందాలో తెలుసునా? "తేన త్యక్తేన" ఇంతకు ముందు మనం తెలుసుకున్న దాన్నిబట్టి ఇదంతా పరమాత్మది అయితే 'నేను అనుభవిస్తున్నాను, నాకోసం అనుభవిస్తున్నాను'

అనుకోకూడదు కనుక నీవిప్పుడు ఒక త్యాగం చేయాలి. ఏం త్యాగం చేయాలి వస్తువుల్నా? కాదు "భుంజీథాః" వస్తువులను అనుభవించు అనే చెబుతోంది. మరి "త్యక్తేన" త్యాగము చేత, ఏ త్యాగం చేయాలి? అంటే భావాన్ని త్యాగం చేయాలి. ఏ భావాన్ని త్యాగం చేయాలి. ఇవన్నీ నా కోసం, ఇవన్నీ నేను అనుభవిస్తున్నాను. ఇదంతా నావల్ల తయారవుతోంది ఈ భావం వదలి పెట్టేయ్. నేను కాదు అనుభవించేవాడ్ని, లోపల వుండే వాడు. నా కోసం కాదు ఇవన్నీ, వాడి కోసం. వీటివల్ల కలిగే ఫలితం నాకు కాదు, వాడికి. ఇలాగ నీ భావమును త్యాగము చేయుటను "త్రివిధ పరిత్యాగం" అంటారు. "ఫల సంగ, కర్తృత్వ త్యాగము" అంటారు. కర్తృత్వ త్యాగము చేయుట అంటే 'నేను కాదు' అనుకోవడం. 'సంగత్యాగం' అంటే ఇది నావల్ల కాదు అనుకోవడము. 'ఫలత్యాగం' అంటే దీన్ని అనుభవించే వాడ్ని నేను కాదు, లోపలుండే వాడు. ఎవడిదో ఇదంతా వాడికి, ఈ భావంతో "భుంజీథాః" అనుభవించండి. అంతేకాని "కస్యస్విద్ధనం" ఇతరులదైనటువంటి వస్తువుని, "మా గృధః" నీది అని అనుకోవద్దు. అయా వస్తువుల స్వరూపం భగవంతుడిది అని తెలుసుకున్నప్పుడు, దానిని నాకు, నాక్కావాలి యని దేనియందూ కూడా 'లోభం పొందకు' అనగా ఇతరుల ధనం దొంగతనం చేయడానికి ప్రయత్నించకు అని అర్థం.

ఇది అంతా భగవంతుడిది అయితే ఇల్లు మాదండి. ఈ ధనం మాదండి, వీళ్ళు అంతా మా వాళ్ళండి అని అంటూ వుంటారు. నీదా ఆ ఇల్లు? నీదా ఆ ధనం? నేనే కోసుకున్నానండి ఆ పండుని, నేనే వేసుకున్నానండి ఆ చెట్టుని, ఇది నాది. ఇలా అంటూంటారు. నీదా ఆ చెట్టు? భగవానునిది. నీదా ధనం? కాదు వాడిదే. నీదా ఇల్లు? అదీ వాడిదే. ఈ వస్త్రం? నాదే, నేనే కొనుక్కున్నా అంటారు. నువ్వా కొనుక్కున్నది? కాదు. ధనం వాడిది, వస్త్రం వాడిది.



అన్నీవాడివే అయితే వదలి పెట్టేయాలా? వదలొద్దు. అనుభవించు. ఎలా అనుభవించాలి? భావత్యాగంతో వీటన్నిటినీ అనుభవించు తప్ప, వస్తుతః వీటన్నిటినీ వదలి పెట్టేందుకు అలా వీలు లేదు. వస్తువులను అనుభవించి తీరాలి. శరీరం, అన్న తరువాత అనుభవించకుండా ఎలా వుంటాం? ఆకలి వేయకుండా వుంటుందా, ఆహారం తీసుకోకుండా వుంటామా? బట్టలు కట్టకుండా వుంటామా, భూమిమీద నిలవకుండా ఉంటామా! ఇవన్నీ వుంటాయి. కానీ వీటన్నిటినీ అనుభవించేటప్పుడు భావ త్యాగ పూర్వకముగ అనుభవించు తప్ప ఇతరులదైన ధనము యందు నాకు కావాలి అనేటటువంటి చౌర్యబుద్ధిని వదలిపెట్టు లోభాన్ని త్యాగం చెయ్యి. మన భారతీయజాతికి ఇది చాలా ప్రధానమైనది.

'జీవనాడి' అంటాము మనం. జీవనాడి అంటే ఏమిటి? 'మూలసూత్రం' భారత జాతికి మూలసూత్రం "కస్యస్విద్ధనం మాగృధః" ఏ ఇతరుని వస్తువు యందు కూడా నాది అనే భావాన్ని నీవు పెట్టుకోకు. నీకు భగవంతుడు ఇచ్చినదాని తోటి వాటి వాటిని అనుభవించు అనుభవించేటప్పుడు త్యాగబుద్ధితో అనుభవించు. రాముడు అదే కదా మనకి తెలియజేస్తాడు. భరతుడు అదేకదా మనకి తెలియజేస్తాడు. రాజ్యాన్ని పరిపాలించాడు, కానీ త్యాగ భావముతోటి ఇది రాముడిది అని భావించాడు. ఇదీ మనకి సూక్ష్మంగ "ఈశావాస్యోపనిషత్" లో మొదటి మంత్రం తెలియజేస్తోంది.

**2వ మంత్రము:**

**కుర్వన్నేవేహ కర్మాణి - జిజీవిషేత్ శతగ్ం సమాః।**
**ఏవం త్వయి నాన్యదేతోస్తి - నకర్మ లిప్యతే నరే॥**

అనుభవించడానికి ముందు సంపాదించాలి. అంటే కర్మ "అనుష్ఠానం" అవసరం కర్మ అనుష్టిస్తే ఆ కర్మ యొక్క ఫలితం మళ్ళీ తనని చుట్టుకుంటూ వుంటుంది. కర్మ ఫలితం చుట్టుకుంటే తిరిగి సంసారంలోకి రావాలి. కనుక, సంసారం నుండి విముక్తి రావాలి అంటే కర్మలు చుట్టుకోకూడదు. చుట్టుకోకూడదు అంటే కర్మలు చేయకుండా వుంటే సరిపోతుంది, కనుక కర్మలు చేయడం మానేద్దామా అనే సందేహం కలుగవచ్చును. అలాంటి వారికి సమాధానం చెబుతుంది. "కుర్వన్నేవేహ" అనే టటువంటి మంత్రము ఈ మంత్రం స్పష్టముగా మానవుడై పుట్టిన ప్రతివాడూ జీవించివున్నంత వరకు కర్మాచరణ చేస్తూనే వుండాలి. ఎప్పుడూ చనిపోదామనుకోకూడదు. ఎప్పుడూ కర్మలు వదలి పెట్టేద్దాం అనుకోకూడదు, అని చాలా గట్టిగా చెబుతుంది అయితే చేసే క్రమం తెలుసుకొని చెయ్యి. పని మానకూడదు, కానీ ఎలా చేయాలో తెలుసుకొని చేయడంలో తప్పలేదు. అంటే, ఉదాహరణకు "కరెంటుతో పని చేయాలి, షాక్ కొట్టకూడదు, పని మానకూడదు. ఏం చేస్తున్నాం మనం? చేతికి పైన ఒక అచ్ఛాదన వేసుకుంటున్నాం మనం. పని చేస్తూవుంటే షాక్ కొడుతుందా? పని ఆపేస్తున్నామా? రెండిటికి లోపం ఎట్లా లేదో, అలాగే కర్మాచరణక్రమాన్ని చెబుతుంది. ఇక్కడ ఈ ఉపనిషత్. "ఇహ" అంటే మనం ఇక్కడ ఈ శరీరంలో ఉన్నంతవరకూ. కొంతమంది సన్యాసులమయ్యాము కనుక మాకు ఇక కర్మలు అక్కర్లేదు అనుకుంటారు. కొంతమంది మేము జ్ఞానులమైపోయాము. కనుక మాకు కర్మలు అక్కర్లేదు అంటారు. అటువంటి వారినిగూర్చికూడ చెబుతోంది "ఇహ" ఈ శరీరంలో



వున్నంత వరకూ కూడ "కుర్వన్నేవ" 'ఏవ' గట్టిగా నొక్కి చెబుతోంది. "పనులు చేస్తూనే", "జిజీవిషేత్" బ్రతకగోరాలి, చచ్చిపోతాననరాదు ఎప్పుడూ. హాయిగా జీవించాలని కోరుకో. ఎంత కాలం జీవించాలండి ఈ శరీరంలో. "శతగ్ం సమాః" నూరేళ్ళు బ్రతుకు. మరి కొంతమంది 90 ఏళ్ళకే పోతున్నారు కదండీ? అంటే, కొంతమంది పాతికేళ్ళకే పోతున్నారండీ. ఇలా సంశయంకలగచ్చు. ఇక్కడ "శతగ్ం సమాః" వంద ఏళ్ళు అంటే, 99+1 ఒకటి కాదు, ఒక జీవి ఒక శరీరంలో ప్రవేశించిన తరువాత ఆ దేహంలో ఎంతకాలం వుండాలి అని ఆతని నుదుట రాసిపెట్టి వున్నదో అది ఆ జీవికి వందేళ్ళు అంటాము మనం. అలాగ నీకు నియమించబడ్డ కాలం అంతా కూడ పరిపూర్ణంగా "జిజీవిషేత్" జీవించాలని కోరు. అయితే హాయిగా పడుకుంటామండి భోంచేసేసి అంటే, కూడదు. "కుర్వన్నేవ" ఏవకారం ఎప్పుడూ కూడ మరొకదాన్ని కాకుండా అని ఖండిస్తుంది. 'చేస్తూనే' అంటే అర్థం ఏమిటి? చేయకుండా వుండకూడదు అని అర్థమన్నమాట. అందుచేత నీకు విధించబడిన ఏవైతే కర్తవ్యాలు వున్నాయో వాటి పరిపాలన చేస్తూనే జీవించు. జీవించాలనే కోరుకో. "ఏవం త్వయినాన్యథేతోస్తి ఇతః అన్యథా నాస్తి" నువ్వు నిజంగా బుద్ధిమంతుడు అయితే నువ్వు నిజంగా బాగుపడాలి అని కోరుకునేటట్లయితే ఇంతకంటే వేరే మార్గం నీకు లేనేలేదు. అయితే కర్మలు చేస్తూవుంటే వాటి ఫలితాలు అన్నీ వచ్చిచుట్టేసుకోవండీ? కర్మలు అన్ని ఆచరించడం వల్ల వాసనలు, రుచులు ఏర్పడిపోవూ? నీకు ఆ బెంగ అక్కర్లేదు. "న కర్మ లిప్యతే నరే" "నరే" ఇటువంటి జ్ఞానము కలిగిన మానవుడు వుంటాడే, కర్మాచరణ చేస్తూవుంటాడు కదా, వాడు చేసేటప్పుడు, ఆ కర్మల యొక్క ఫలితము ఆ మానవుడియందు "న లిప్యతే" అంటుకొనదు. "లేపనము" అంటే "పూత" కర్మఫలితములు వాడియందు పూసుకొనవు.

కరెంటు ముట్టుకున్నా పైన ఒక అచ్ఛాదన వేసుకున్నట్లైతే అది ఎట్లాగైతే షాక్ కొట్టదో, అట్లాగే కర్మ ఆచరించేటప్పుడు పొందవలసినటువంటి జ్ఞానాన్ని తానుకనుక పొంది ఆచరించినట్లయితే "కర్తృత్వ సంగ" ఫల, త్యాగపూర్వకముగా ఇప్పుడు కర్మాచరణ చేసినట్లయితే కర్మలు వాడియందు అంటుకోవు. పెన్ మనం చేత్తో పట్టుకొని రాస్తున్నాం. తప్పురాస్తే "పెన్"నా కోప్పడతాం? రైట్ వ్రాస్తే పెన్‌కుటండే మాల వేస్తాం. వెయ్యం. ఎందుకని? వ్రాసేది అదే, కానీ నేను కర్తను అనుకోదు. కాగితంతో దానికే సంబంధం ఎక్కువ. కానీ నా వల్ల, వ్రాస్తున్నావు అనదు ఎప్పుడునూ. వ్రాసినది పెన్నే కానీ వ్రాసిన దాని వలన లాభం నాకు అనదు. జ్ఞానం కలిగిన మానవుడా! నీకైనా అంతే. కనుక నీవుకూడ ఫల సంగ కర్తృత్వ త్యాగ పూర్వకముగా ఏనాడు కర్మ ఆచరణ చేస్తూ జీవిస్తావో ఆనాడు ఆ కర్మలు నీకు తమ యొక్క ప్రభావమును, చూపవు, నీకు అవి అంటవు. కనుక ఇక బెంగ ఏమి? అంటూ ఈ రెండవ మంత్రం కర్మ ఆచరణ మనిషి అయి పుట్టిన ప్రతివ్యక్తికి కూడా తప్పనిసరి అని శాసిస్తోంది. కనుక ఎవ్వడూ కూడా కర్మలు మానేస్తాం అనికాని జ్ఞానం కలిగినది అనుకున్నా తామన్నీ వదలివేశాం అనుకున్నా అర్థాంతరంగ చనిపోదామని అనుకున్నా కూడదు సుమా" అని చెప్తోంది.

### 3వ మంత్రము:

**అసుర్యా నామ తే లోకాః - అంధేన తమసా2 వృతాః**
**తాంస్తే ప్రేత్యాభి గచ్ఛంతి - ఏకే చాత్మ హనో జనాః**

కర్మ ఆచరించక ఎవరు వదలివేస్తాం అన్నా, అలాంటివారికి ఏ గతి కలుగుతుందో మనకి తెలియచేస్తుంది మూడవ మంత్రము. కొంతమంది బుద్ధిహీనులై 'మేం చేయం' ఈ పనిని మాకు అఖ్కర్లేదు ఈ బాధ్యతలు. అంటూ తమకు ఏర్పడినటువంటి బాధ్యతలని వదలి తమయొక్క కర్తవ్యములనుండి విముఖులై పోతారు. పనులు మానేస్తే వాళ్ళుండగలుగుతారా, మరొక రకముగా పనులుచేయవలసి వస్తుంది. అపుడు ఏం అయిందన్నమాట, వాని స్వరూపానికి అది ఒక హానిగ ఏర్పడింది. అన్నం తిననంటాడు. కానీ ఆకలి వేస్తూవుంటుంది. అయ్యో తినలేదే, తినలేదే అని దాన్నే తలచుకుంటూ కూర్చుంటాడు. తినేస్తే ఇక హాయిగా అన్నం ధ్యాసలేకుండా చదువుకోగలుగుతాడు. ఏకాదశి వచ్చింది మానెయ్యమంటే అయ్యో మానేసానే అని దానినిగూర్చి ఎక్కువ తలచుకుంటాడు. పాపం! వాడికి చదువు మీద దృష్టి వుండదు. అన్నమూ వాడికి లభించలేదు. ఏమైంది సారాంశం. పాపం! వాడియొక్క చదువవలసిన స్వరూపం చెడింది కదా! అలాగే కొందరం కర్మలు మానాం అని పైకి మాత్రం అనుకుంటారు. కానీ, అలాంటి వారు తమ స్వరూపాన్ని నశింపచేసుకుంటున్నారని అర్థం. స్వరూపము అంటే ఆత్మ అని అర్థం. తమయొక్క స్వరూపమును నశింపచేసుకొనువారు గనుక వారికి "ఆత్మహనులు" అని పేరు. ఇలాంటి "ఏకేచాత్మహనో జనాః" ఇలాంటి స్వరూపాన్ని నశింపచేసుకొనే బుద్ధిహీనులుంటారే వాళ్ళు ఏమవుతారో తెలుసునా? "అసుర్యా నామ తే లోకాః" అసుర సంబంధమైన లోకములు కొన్ని వుంటాయి. అసుర్యములని వాటికి పేరు. అంటే అక్కడకు వెడితే అన్నీకూడ దుష్టమైనటువంటి ప్రవృత్తులు కలిగిన స్వరూపాలే వాడికి లభిస్తాయి. వాడు అక్కడ చాలా దుఃఖం అనుభవిస్తూ బ్రతుకవలసి వస్తుంది. కారణం! అక్కడ ఏం వెలుతురు వుండదు. "అంధేన తమసావృతాః" గాఢాంధకారం ఆవరించియుంటుంది ఆ లోకాల్లోనట. ఎప్పుడు వెడతాడు అక్కడకు? అని అడిగితే, ఈ శరీరం వున్నంతకాలం ఇక్కడవుంటాడు. కానీ ఈ శరీరములోనుండి ఒకనాడు వెళ్ళక

తప్పదు. "ప్రేత్య" ఏనాడు అయితే వాడు ఈ శరీరమును వదలి పెడతాడో, బాలుడుగా ఉండేవాడికి, బాల్యం పోతోంది. యవ్వనం వస్తోంది. యువకుడిగా ఉండేవాడికి, యవ్వనం పోతోంది. వార్ధక్యం వస్తోంది. వార్ధక్యం వచ్చినవాడికి అదిపోయి మరొక శరీరం రాక తప్పదు. ఈ శరీరం వదలినప్పుడు ఉండే స్థితికి "ప్రేత' ' అని పేరు. "ప్రేత్య" ఇది వదలిన తరువాత వాడు పొందే మరొక శరీరం ఉంటుందే, అదిమాత్రం ఇటువంటి సుఖం పొందే శరీరం మాత్రం కాదు. ఇలాంటి వెలుతురును చూడగల్గిన శరీరం కాదు. వెలుతురును ఏమాత్రం చొరనివ్వని గాఢాంధకార బంధురమై దుఃఖమును మాత్రము ఇచ్చేటటు వంటి అసుర్యములు అనేటటువంటి లోకములకు వాడు చేరు తాడు, ఎందుకంటే స్వరూపమును నశింపచేసుకొన్నాడు కనుక. అని ఈ ఉపనిషత్ తెలియజేస్తోంది. ఆత్మకి కల్గేటటువంటి నష్టము తెలియక, ఆచరించవలసిన కర్మలని మనం ఆచరించము అంటూ వదలిపెట్టేస్తాం. అంటే ఏమన్న మాట? ఈ వేళ మనకి జ్ఞానం ప్రకాశిస్తోంది. ఓహో ఇది ఉంది, ఇది లేదు, ఇది అలాంటిది, అది ఇలాంటిది అని తెలుసుకోగలిగే స్థితిని కల్గిఉన్నాం మనం. కాని కర్మ ఆచరణ మానిన వాడికి కల్గేటటువంటి స్థితిఉందే, అందులో వాడికి వస్తువుల్ని గుర్తించే సామర్థ్యం లేని దేహం వస్తుందన్నమాట. ఇప్పుడు పశువులు లోపలిదాన్ని ఏమి గుర్తించగలవు? మురికిలో జీవించే క్రిమికీట కాదులు ఏమి గుర్తించగలవు? కనుక, అవికూడా అటువంటి స్థితిలోనే ఉన్నట్లు లెక్క. వాటికికూడా జ్ఞానమనేది ప్రకాశిం చడం లేదు. కనుక జ్ఞానం ప్రకాశించని క్షుద్రదేహాలు వస్తాయి సుమా! అలాంటి స్థితి తెచ్చుకోకండి అని ఉపనిషత్ జాలిచేత మనకందరికి ఒకమంచి ఉపదేశం చేస్తోంది. త్రివిధ త్యాగపూ ర్వకముగా కర్మాచరణచేస్తూ హాయిగా జీవించండి. మంచి స్థితి పొందండి.



కేవల కర్మత్యాగం చేయాలి అని కాకుండా, త్రివిధ పరిత్యా గపూర్వకముగా కర్మాచరణ చేయాలి అన్నారు కదా! త్యాగం భగవంతుడి మీద కదా! చేయాలి అన్నారు. భగవంతుడిమీద త్యాగం చేస్తామంటే వాడు అంతటా వుండాలికదా! ఎదురుగా అర్చామూర్తిగా ఉండి అంతటా వుండటంలేదు. మిగతాచోట్ల కన్పించుటలేదు మరి ఎట్లా? అని సందేహం కలుగుతుందేమో. వాడు ఎట్లాంటివాడో చెబుతాం. అని మనకి ఉపనిషత్ పరమా త్మకు ఉండేటటువంటి ఒక అద్భుతమైన స్వరూపస్వభావాన్ని వర్ణిస్తోంది.

## 4వ మంత్రము:

అనేజదేకం మనసో జవీయో - నైనద్దేవా అప్నువన్ పూర్వమర్షత్।
తద్ధావతోఽన్యా నత్యేతి తిష్ఠత్ - తస్మిన్నపో మాతరిశ్వా దధాతి॥

ఏమని? పరమాత్మ ఎటువంటివాడు? "అనేజ దేకం మనసో జవీయః" ఆయన ఏకం. అద్వితీయుడు. తనలాంటి వాడు మరెవ్వడూ వున్నవాడు కాదు ఇలా ఇలావుంటాడు అని దేనితో పోల్చి చెప్పలేనటువంటి వాడు. అలాంటి అసాధార ణమైన స్వరూప స్వభావములు కలిగినవాడు అంతేనా! "అనే జత్" "ఈజృకంపనే" అనేది సంస్కృతంలో ఒక ధాతువు. ఆయన ఎప్పుడూ కంపించని వాడు. అంటే చలించడన్న మాట అంతటా పరిపూర్ణంగా నిండివుంటాడు. చలించవలసిన అవసరం లేదు ఆయనకి. అయితే ఎంత వేగం కలిగినవాడో తెలుసునా? అన్నిటికంటే వేగం ఎక్కువ మన మనస్సుకి. ఇక్కడ కూర్చొనే హైదరాబాద్, ఢిల్లీ, మద్రాసు, అమెరికా, పరమపదం అని అను కుంటే చాలు. వెళ్ళిపోతుంది వెంటవెంటనే. కాని ఆ మనస్సు ఎంతదూరం వెళుతుందో అంతకంటే ముందు తానుంటాడు అక్కడ. అంటే ఏమిటన్నమాట. మనస్సుకంటే వేగం కల్గిన

వాడు. మనస్సులోకూడ తానుండుటవలననే కదా మనస్సుకావేగం వచ్చింది. అందుచేత అయితే ఎవరికండీ తెలుస్తుంది ఇలాగని? దేవతలకి తెలుస్తుందా? మనకంటే గొప్పవాళ్ళే అయినా వాళ్ళకి కూడ తెలియదు.

"నైనద్దేవా అప్నువన్ పూర్వ మర్షత్" పూర్వ మర్షత్, ఆయన అంతటను వ్యాపించి యున్నాడు. అయినప్పటికి కూడా దేవతలుకూడ అతనిని తెలుకోలేక పోయారు. తెలుసుకొనిఉంటే అహంకారంతో అహంభావంతో రాక్షసుల చేతుల్లో ఎన్నోసార్లు రాజ్యం పోగొట్టుకొని మొట్టికాయలు తినవలసిన పరిస్థితి ఎందుకేర్పడుతుంది? కనుక వాళ్ళకి తెలియదన్నమాట. బ్రహ్మ, రుద్ర, ఇంద్ర, వరుణ, వాయువు ఎవరైనా కానివ్వండి వీళ్ళెవరికీ కూడ ఆ భగవంతుడి స్వరూపం బాగా తెలియదు. కనుకనే మనకి ఉపనిషత్తులు చెప్పవలసి వచ్చింది. ఎలా ఉంటాడు ఆ పరమాత్మ? ఒకచోట స్థిరంగా ఉంటున్నప్పటికీ కూడ "తద్ధావతో అన్యానత్యేతి". వేగంగా పరుగెత్తే వస్తువులు కొన్నివున్నాయి లోకంలో. ఇంతకుముందు మనస్సు అనుకున్నాం. మనస్సుకంటే వేగం ఎవరికుందో తెలుసునా? గరుత్మంతుడుకి. ఆ గరుత్మంతుడికంటే వేగం కల్గినవి వేరే ఏమైనా ఉంటే ఉండుగాక, వాటన్నిటికంటే ముందుగా తాను అక్కడకి చేరగలడన్న మాట "ధావతః" పరిగెడుతున్నవాడై "అన్యాన్" ఇతరమైనటువంటి వాటన్నిటిని "అత్యేతి" అతిక్రమిస్తాడు. కాని ఎలావుంటూ, "తిష్ఠత్" అక్కడా స్థిరంగానే ఉంటాడు ఇక్కడా స్థిరంగానే వుంటాడు. అంతటా తాను వ్యాపించిన వాడు కనుక ఈ లోకంలో, భూమిమీద నీళ్ళు ఉన్నాయి. అవి ఏ ఆధారం లేకుండానే వున్నాయి భూమి తిరుగుతుంది. నీళ్ళు క్రిందపడిపోతున్నాయా? అలా ఆకాశంలోకి ఎగిరిపోతున్నాయా? కారణం ఏమిటని అడిగితే, మన వైజ్ఞానికులు గాలియొక్క వత్తిడి, వాయు పీడనము అనేకదా మీకు సైన్సులో చెబుతున్నారు. వాయుపీ



డనం వలన గాలి నీటిని నొక్కిపెడుతుంది. దానికి ఉదాహరణగా మనవాళ్ళు గ్లాసులో నీరుపోసి క్రిందకి త్రిప్పితే గ్లాసులో నీరు క్రింద పడదని చెబుతారు కదా! అయితే గాలికి అలానీటిని నొక్కిపెట్టే శక్తి ఉందా? అసలు గాలికి ఆధారమేమి? గాలి ఎందుకు సంచరిస్తోంది? అంటే, గాలిని కూడ సంచరింపజేసే వాడొకడున్నాడు. గాలి ఆకాశంలో నిరాధారముగా తిరుగుతోంది కాని ఆ గాలి అంతటా వ్యాపించిపోతోందా? కొన్ని హద్దుల్లో ఉంటోంది కారణం? ఆ వాయువుని కూడ వెనుకనుండి నడిపేవాడు ఒకడున్నాడు. "యధా ఆకాశ స్థితో వాయుః సర్వత్రగః మహాన్" నాయందే ఉన్నది కనుక, నావల్లె ఆకాశం, అందులో వాయువు నిలచిఉన్నాయి అంటాడు భగవద్గీతలో. అలాగే "తస్మిన్" ఆ అంతటా వ్యాపించి స్థిరముగా అన్నిటిలో వ్యాపించి అన్నిటికంటే ముందుగా వుండగలిగే పరమాత్మ ఉన్నాడే, ఆతనియందు మాత్రమే ఆధారపడియుండుటచేత "మాతరిశ్వా" వాయువు కూడా "అపః దధాతి" నీటిని అలా నొక్కిపడుతోంది. పరమాత్మే వాయువునకు ఆధారం. నీటికి అదే ఆధారం. అన్నిటికి ఆయనే ఆధారం. జీవరాశికి కూడ అదే పరమాత్మ ఆధారం. కనుక నీకు బెంగ ఏమిటి? అన్నిటికి ఆధారమై తానుండే పరమాత్మ అంతటా వ్యాపించి, అన్నిటికి ముందుండి నువ్వు ఇప్పుడు ఇస్తానంటే ఇక్కడే పుచ్చుకొనేందుకు తాను సిద్ధంగా ఉంటే నీ భావాన్ని వాడియందు త్యాగం చెయ్యడానికి నీకేమిటి లోపం కనుక? కనుక భావ త్యాగము చేసి ఇప్పుడు నీవు జీవించు హాయిగా అనుభవించు అని భావత్యాగం చెయ్యడానికి స్వీకరించకల్గిన పరమాత్మ యొక్క అసాధారణమైన గొప్పశక్తి ఎలాంటిదో తెలుసునా? అని నాల్గవ మంత్రం తెలియజేస్తున్నది.

**5వ మంత్రము:**

**తదేజతి తన్నైజతి - తద్దూరే తద్వ దంతి కే।**
**తదంతరస్య సర్వస్య - తదు సర్వస్యాస్య బాహ్యతః॥**

విష్ణు సహస్రనామ స్తోత్రంలో

"ద్యౌస్స చంద్రార్క నక్షత్రం ఖందిశో భూర్మహోదధిః
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః"

అని మనం అనుసంధానం చేస్తున్నాం ఆకాశం కాని, భూమి కాని, జలంకాని, ఇతరమైనటువంటి ఏ వస్తువులుకాని పరమాత్మ శక్తిచేతనే అవన్నీ ధరింపబడుతున్నాయి అని మనకు తెలుస్తోంది. ఉపనిషత్తులు కూడా ఇదే రహస్యాన్ని మనకు తెలియచేస్తున్నాయి. దాన్నే ఈశావాస్యోపనిషత్తులో నాల్గవ మంత్రము వివరిస్తూ, ఆ వివరిస్తున్న దానిని మరింత స్పష్టముగా ఐదవ మంత్రం తెలియజేస్తోంది.

"తదేజతి తన్నైజతి-తద్దూరే తద్వదన్తికే" పరస్పరం ఈ మాటలు విరుద్ధంగా ఉన్నట్లు మనకు కన్పిస్తాయి ఏమిటవి? "తదేజతి" ఏజతి = కంపించునది. తన్నైజతి = అది కంపించదు; తద్దూరే = అది దూరముగా యున్నది; తద్వదన్తికే = అది దగ్గరగా వుంది. దగ్గరగా వుంటే దూరంగా ఉండకూడదు. దూరంగా వుంటే దగ్గరగా వుండకూడదు. కంపించేది అయితే నిశ్చలముగా ఉండేది కాకూడదు. నిశ్చలముగా ఉన్నది అయితే అది కంపించగూడదు. కాని ఏమిటి ఈ ఉపనిషత్ ఇలాగ. ఒకదానికొకటి పరస్పరం విరుద్ధంగా ఉండేమాటలు మాట్లాడుతోంది అని అనిపిస్తోంది పైకి, మనం దీన్ని చూసినప్పుడు. కాని సర్వత్రా వ్యాపించి ఉండేటటువంటి పరమాత్మ మహిమను అందముగా వివరిస్తున్న మంత్రం అని మనం తెలుసుకోవాలి. భగవంతుడు కంపిస్తాడు ఎందుకో తెలుసునా? తనని ఆశ్రయించినటువంటి భక్తులు ఒకనాడు దుఃఖిస్తే వారిదుఃఖాన్ని చూసి తాను చాలా నిశ్చలుడై ఉండేవాడైనప్పటికి వారికంటే ఎక్కువగా తాను కంపిస్తాడు. రామచంద్రుడి గురించి చెబుతూ "వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః" అని తన పాలనలో ఉండేటటువంటి వ్యక్తి ఎవరైనా కష్టం పొందితే, వారియొక్క కష్టానికి వారికంటే ఎక్కువగా శోకించేవాడట శ్రీరామచంద్రుడు. ఇది భగవంతుని యొక్క స్వభావం. కనుక భగవంతునికి ఆశ్రితుల యొక్క దుఃఖానికి, హృదయం దయతోటి కంపిస్తుంది. కనుక "తదేజతి" అయితే అంత దయాళువా? అయితే ఎవరికైనా తప్పచేసినవారికైనా తను అంత సులభముగా లొంగిపోతాడేమో? కాదు. ఎంత గొప్పవాడైనప్పటికీ కూడా తన ప్రయత్నంతోటి భగవంతుడిని అనుగ్రహింపచేసుకుంటానంటూ ప్రయత్నం ప్రారంభిస్తే, అలాంటివారు ఎన్నిరకాల కాయక్లేశాదులు అనుభవించినా, ఎంత తపస్సు ఆచరించినా, ఎన్ని యజ్ఞాలు చేసినా, ఎన్నిదానములు అర్పించినా, అలాంటి వారియొక్క స్వప్రయత్నానికి ఏమాత్రం చలించేవాడు కాదు ఆయన. "తన్నైజతి" కనుక వాడెప్పడూ చలించనివాడే తమ ప్రయత్నంపై నిలబడ్డవారికి. భగవత్ అనుగ్రహంపై నిలబడ్డవారికి తాను సులభముగా కంపించుతాడు. అలాగే "తద్దూరే" ఆయన దూరముగా ఉంటాడు. ఎవరికి? ఎవరైతే మేమే భగవంతుడిని చేరగలం అనుకుంటారో వారికి. అయితే "తద్వదన్తికే" ఎవరైతే 'మా ప్రయత్నం ఏదీలేదు భగవంతుడిని పొందటానికి' అనుకుంటారో, వారికి ప్రక్కనే తానుంటాడు. కనుక భగవంతుణ్ణి తెలుసుకోవడం భగవదనుగ్రహముతోనే సులభము తప్ప మన జ్ఞానానికి లొంగేవాడు కాదు ఆయన. "సులభః సువ్రతః సిద్ధః" అని విష్ణు సహస్రనామం తెలిపింది. అలాగే "దుర్లభః దుర్గమో దుర్గః" ఇవి శ్రీ విష్ణు సహస్రనామములోనివి. ఒకచోట "సులభః"

అని చెప్పింది. మరోచోట "దుర్లభః" అని చెప్పింది? సులభుడు, తనంతట తానుగా ఎవరిని అయితే అనుగ్రహించాలి అనుకుంటాడో, అలాంటి వాళ్ళకి. "దుర్లభుడు" ఎవరైతే తమ ప్రయత్నంతోటి వాడిని చేరాలనుకుంటారో అలాంటివారికి. కనుక భగవంతుడు దుర్లభుడు, సులభుడు కూడా. దగ్గరివాడు, దూరపు వాడు కూడా. స్వప్రయత్నంతో ఆశ్రయించేవారికి దుర్లభుడు, దూరుడు. భగవంతుని అనుగ్రహంమీద ఆధారపడ్డవారికి సులభుడు, దగ్గరివాడు కూడా. ఆయన "తదంతరస్య సర్వస్య" సర్వస్య = ఈ కనిపించేటటువంటి ఈ చరాచర జగత్తుకు అంతటికి కూడా, అంతః= లోపల ఉంటాడు. అయితే కేవలం లోపల ఉండిఉంటాడా? కాదు "సర్వస్య అస్య" ఈ జగత్తుకు అంతటికి కూడా; బాహ్యతః = ఆవలకూడా వ్యాపించి యుంటాడు. లోపల ఉంటాడు కనుక సులభుడు. బయట అంతా వ్యాపించి యుంటాడు కనుక దుర్లభుడు. ఇది భగవంతుడికి ఉండే అసాధారణ ధర్మం అని ఈ ఉపనిషత్ ఐదవమంత్రము తెలియజేస్తోంది.

### 6వ మంత్రము:

యస్తు సర్వాణి భూతాని - ఆత్మన్యే వానుపశ్యతి।
సర్వభూతేషు చాత్మానం - తతో న విజుగుప్సతే॥

పరమాత్మయొక్క గొప్పస్వభావాన్ని తెలుసుకొంటే కలిగే లాభం ఏమిటి? తెలియజేస్తోంది ఈ ఉపనిషత్‌లోని ఆరవ మంత్రము.

ఉపనిషత్తుల్లో వినిపించేటటువంటి కొన్ని శబ్దాలకి రకరకాల అర్థాలు ఉంటాయి. ఆత్మ, బ్రహ్మ అనేవి కొన్ని పదాలు. "ఆత్మ" అంటే జీవే, ధృతౌ, దేహే, స్వభావే, పరమాత్మని అంటూ, "జీవుడు" అని అర్థము. "ధారణ" అని అర్థము. "భావము" అని అర్థము. "శరీరము" అని అర్థము "పర



మాత్మ" అని కూడా అర్థము చెప్పవచ్చును. అలాగే "బ్రహ్మ" అనే పదానికి "ప్రకృతి" అని అర్థము చెప్పవచ్చును. బ్రహ్మ అనే పదానికే "జీవుడు" అని అర్థము చెప్పవచ్చును. బ్రహ్మ అనేపదానికే పరమాత్మ అనే అర్థము చెప్పవచ్చును. బ్రహ్మ అంటే బృహతీ బృంహయతీ కనుక, బృహతి = తాను పెరిగి వుండేది "బృంహయతి" = తాను పెంచునది. ఉపనిషత్తులలో మనం ఇలాంటి శబ్దములు వాడుకునేటప్పుడు పెద్దలద్వారా ఎలా, ఎలా వాటిని ఎక్కడెక్కడ ఎటువంటి అర్థంతో వాడుకోవాలో జాగ్రత్తగా తెలుసుకొని వాడుకోవాలి అంటూఉంటారు. ఆరవ మంత్రం, మనకి ఆత్మ అనే ఒక పదాన్ని గురించి పరమాత్మ పరముగ దాన్ని వాడుతూ చెబుతోంది. ఇక్కడ ప్రకరణం, ఇంతకుముందు వరకు పరమాత్మ గొప్పతనం తెలియజేస్తుంది కనుక, ఇందులో ఇప్పుడు పరమాత్మ విషయకముగా ఆత్మ శబ్దాన్ని వాడుతోంది.

యస్తు = ఎవడైతే; సర్వాణి భూతాని = ఈ చుట్టూ చూసేటటువంటి పదార్థములన్నిటియందు కూడా; ఆత్మన్యేవ = ఆత్మని పరమాత్మయందు ఆధారపడినదిగా; అనుపశ్యతి = గుర్తిస్తాడు; సర్వభూతేషుచ ఆత్మానం, సర్వభూతేషు = ఈ పదార్థములు అన్నిటియందు కూడా; ఆత్మానం = ఆ పరమాత్మను లోపల వ్యాపించి ఉన్నవాడుగా; అనుపశ్యతి = గుర్తిస్తాడో వాడు యదార్థమైన దృష్టి కలిగినవాడు. లోపల, బయట వ్యాపించి ఉన్నవాడు ఈశుడు, ఆతడే బ్రహ్మ, అతడిని గుర్తించినవాడు కనుక అతడిని బ్రహ్మజ్ఞాని అంటారు. ఇలాంటి బ్రహ్మ జ్ఞానికి ఏ వస్తువు చూసినా అందులో పరమాత్మ ఉన్నాడనే తెలుస్తుంది. ఈ వస్తువులు అన్నిటికి, బయట పరమాత్మ వ్యాపించి తనయందు ధరించి ఉన్నాడని తెలుస్తుంది. కనుక ఇప్పుడు ఎవరిని చూసినా, ఏ వస్తువును చూసినా, ఏ జీవిని చూసినా తనలో ఉన్న పరమాత్మే,

ఆ జీవిలో ఉన్నాడని గుర్తించి తనని తాను ఎలా ప్రేమిస్తాడో ప్రతివస్తువుని తాను అలా ప్రేమించగలుగుతాడు. కనుక ఇప్పుడు వాడికి ఎవనియందు కూడ ఏహ్యభావం ఉండదు, జుగుప్స = అసహ్యించుకొనుట, వాడిలో ఉండనే ఉండదు. తతో న విజుగుప్సతే. కారణమేమిటి ఇవన్నీకూడా "బ్రహ్మాత్మకములు" అనే జ్ఞానం వాడిలో స్పష్టముగా ఉంటుంది కనుక ఎవడి యందు మనకు ఏహ్యభావం ఏర్పడుతుందో వాడిని ద్వేషిస్తాం. ద్వేషించగానే దూరంగా ఉంచాలనిపిస్తుంది. వాడు దూరంగా జరుగకపోతే కోపం వస్తుంది. వాడికేదో హింస చేయాలనిపిస్తుంది. తద్వారా పాపం మనల్ని ఆవరిస్తుంది. ఇది ఎప్పుడు ఏర్ప డింది? వాడియందు తను ఏహ్యభావం ఏర్పరచుకున్నప్పుడు ఏర్పడింది. ఏహ్యభావమే లేకపోతే వాడియందు ద్వేషము ఏర్పడదు, దూరంగా ఉంచాలనిపించదు, వాడికేదో ఒక హింస చేయాలనిపించదు. పాపాన్ని తాను ఆర్జించే అవసరమే ఉండదు. కనుక బ్రహ్మజ్ఞాని అయినవాడు, తను బాగుపడాలి అని కోరు కునేవాడు ముందర ద్వేషాన్ని తగ్గించుకోవాలి, ద్వేషం తగ్గాలి అంటే, అసహ్యం పోవాలి. అంటే ప్రతివస్తువులోను కూడ పర మాత్మ ఉన్నాడని తెలియాలి. ఆ పరమాత్మయొక్క ఉనికిని ఎవడు గుర్తిస్తాడో వాడు మాత్రమే ద్వేషాన్ని తగ్గించుకో గలుగు తాడు. వాడుమాత్రమే పాపమునుండి దూరము కాగలుగుతాడు సుమా! అని మనకి ఈ ఆరవ మంత్రం బ్రహ్మజ్ఞానికి, సమస్త వస్తువులలో, సమస్త వస్తువుల బయట పరమాత్మ యొక్క ఉనికిని గుర్తించడం వలన లాభం ఏమి? అనేది చెబుతోంది.

### 7వ మంత్రము:

యస్మిన్ సర్వాణి భూతాని - ఆత్మైవాభూద్విజానతః।
తత్ర కో మోహః కః శోకః - ఏకత్వమను పశ్యతః॥



మనిషికి వద్దనుకున్నా వచ్చి మీద పడేది శోకం. ఏం చేస్తే పోతుంది శోకం? ఈశావాస్యోపనిషత్‌లో ఏడవ మంత్రము దాని కొక ఉపాయాన్ని చెబుతోంది. ఇంతకుముందు మంత్రములలో మనం తెలుసుకున్న విషయము ఏమిటి? ప్రతి వస్తువులోను భగ వంతుడున్నాడు అని తెలిసింది అప్పుడు వస్తువులన్నీ ఏమైనాయి. భగవంతుడిని లోపల కలిగినవిగా ఉన్నాయి. అందుచేత భగవం తుడు అన్నిటిలో ఉన్నాడు కనుక అన్ని భగవంతుని స్వరూపాలే కదా! అన్ని భగవన్మయములే కదా! భగవంతుళ్ళు ఎంతమంది? ఒక్కడే కనుక ఇప్పుడు అన్ని ఆ భగవంతుడికి చెందినవే కనుక అన్నిటిని ఒకటి అనవచ్చును. ఎట్లా ఒకటి? పైనుండే వస్తువు, లోపల వుండే వస్తువుతో విడదీయ వీలుగా ఉండదు కనుక, ఇవన్నీకూడ భగవంతుడే. మనదగ్గర చూసుకుంటాం కాళ్ళు, చేతులు, పొట్ట, తల, కళ్ళు, ముక్కు, నోరు ఇత్యాది పనులువేరు, రూపాలు వేరు, ఉండేచోట్లు వేరు. కాని "నేను" అనగానే ఇవన్నీ అందులోచేరుతున్నాయా లేదా. లోపల ఉండే నేను ఒక్కడ్నేకాని చేతులు, కాళ్ళు అవయువాలన్నీ వేరువేరు అయినప్పటికి కూడా ఇవన్నీ ఒకడికోసమే అయిఉన్నప్పుడు ఒకడికోసమే పనిచేస్తున్న ప్పుడు ఒకడే వీటన్నిటికి నియంత అయినప్పుడు, ఒకటిలోనే ఇవన్నీ చేరిపోతాయి. అయితే ఒకటైపోతుందా ఇవన్నీ? కాళ్ళు, నేను ఒకటేనా? చేతులు నేను ఒకటేనా? కళ్ళు నేను ఒక టేనా? కాదు. నా చేతులు, నా కాళ్ళు, నా కళ్ళు, కళ్ళులేక పోయినా నేనుంటా, కాళ్ళు లేకపోయినా నేనుంటా, చేతులు లేకపోయినా నేను ఉంటాను. అయితే ఇవన్నీ నా అవయువాలు అంటాము. నా శరీరం అంటాము. నా లోపల ఉండే నాకు పేరు ఏమిటి? శరీరం కలవాడు. కనుక "శరీరి" అంటాము. కనుక పైనుండే శరీరానికి లోపలవుండేనాకు ఒక సంబంధం ఉంది. ఏమిటా సంబంధం? "శరీర-శరీరి భావసంబంధం" అని అంటామన్నమాట. తండ్రికి, పుత్రుడికి ఉన్నసంబంధాన్ని పితా

పుత్ర సంబంధం అన్నట్లుగానే లోపల ఉండేనాకు, పైనఉండే శరీరమునకు ఉండే సంబంధం. "శరీర-శరీరి భావసంబంధం" అన్నమాట. ఇది ఎప్పుడైతే గుర్తిస్తానో 'నేను ఒకటి' అంటా నన్నమాట శరీరము అంతటిని చూపించుకొని. తప్పేమిలేదు అనవచ్చు. ఎందుకనవచ్చు? అంటే శరీరమునుండి నన్ను విడదీ యలేరు కనుక నానుండి నా శరీరమును విడదీయలేరు కనుక, ఒకటి అనవచ్చు. ఇప్పుడు కాలును చూస్తే ఛీ, ఛీ ఇది మంచి దికాదు అనిపించదు నాకాలే కదా, చేతిని చూసినా ఛీ, ఛీ ఇదేదో దూరంగా ఉంచదగ్గ చేయా అనిపించదు, అజ్ఞానం లేదు. ఇవన్నీ నావని తెలిసింది. కనుక నాకు ఈ చెయ్యి దగ్గరకు వస్తే అబ్బబ్బా ఈ చెయ్యి దగ్గరకు వస్తోంది అని నాకు జుగుప్స, దానివల్ల శోకం ఏర్పడడంలేదు. ఈ క్రింద తిరిగే ‹‹ › నాచేత్తో ముట్టుకొంటున్నాను. శోకం కలుగటంలేదు. భ్రమలేదు కనుక శోకం కలుగలేదు. ఇదంతానేనే అని తెలిసింది కనుక శోకం లేదు. ఇవన్నీ నావే అని తెలిసింది కనుక శోకం లేదు. నాకే కాదు నా చేతులకి, కాళ్ళకి కూడా. శోకం లేదిప్పుడు. అవన్నీ నాకే చెందినవి అని తెలిసింది కనుక. ఇప్పుడొకసారి ప్రపంచం దగ్గర చూద్దాం. ప్రపంచంలో మనుషులు, జంతువులు, చెట్లు, దేవతలు ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్నిటిలో వాడున్నాడు. కనుక ఇవన్ని వాడియొక్క శరీరం. వాడియొక్క వివిధములైన అవయ వములవంటివి ఇవన్నీ. వాడు వీటన్నిటిలోపల ఉన్నాడు. ఇప్పుడు ఇవన్నీ ఒకటేనా? వేరా? ఒకటే అనవచ్చు. కనుక ఇప్పుడు చెట్టు చూసినా పరమాత్మ అనవచ్చును, మనిషిని చూసినా పర మాత్మ అనవచ్చును, పక్షిని చూసినా పరమాత్మ అనవచ్చును. ఎందుకు అనవచ్చు? చెట్టు అని పైకి కనిపించే ఆకారమునకు దానిలోని జీవుడు కారణం. జీవునిలోపలి వాడు ఆ పరమాత్మ. మనిషికి లోపల ఉండేటటువంటి జీవునికి లోపల ఉండేవాడు ఆ పరమాత్మ. కనుక ఒకడే ఆ పరమాత్మ అన్నింటా వున్నాడు



కనుక ఇప్పుడు దేన్ని చూసినా వీడికి ఏం అనిపిస్తుంది. ఇవి అంతా పరమాత్మమయమే. అంటే పైది శరీరం, లోపల శరీరి అయిన పరమాత్మ ఉన్నాడు. కనుక పరమాత్మ ఒక్కడే కనుక, అన్నిటిని ఒక్కటే విశ్వశరీరముగా భావిస్తాడు. ఏకత్వ జ్ఞానము కలిగింది అంటాము. ఈ మంత్రము ఎంత అందంగా చెబుతోంది. ఏమని

సర్వాణి భూతాని = సమస్త వస్తువుల్నికూడా; ఆత్మైవా భూత్ = ఆత్మైవ = ఇవన్నీ పరమాత్మని లోపల కలిగినవే. కనుక పరమాత్మే అనే పేరుతో పిలువతగినవే. అని ఆత్మైవ = పరమాత్మయే అని, యస్మిన్ = ఎవనియొక్క బుద్ధిలో; అభూత్ = విశ్వసింపబడుతుందో అవుతుందో అంటే, వాడి బుద్ధిలో అవడం అంటే ఏమిటి? వాడికి తెలుస్తుందో, వాడి ప్పుడు ఎట్లాతెలుసుకొన్నాడు? సమస్త భూతములు పరమాత్మ అనే తెలుసుకొన్నాడు. పరమాత్మ అంటే ఈ చెట్టు పర మాత్మ? మనిషి పరమాత్మ అనా? అంటే మనిషిగా కన్పించే వాడి లోపలకూడా నడిపేవాడు పరమాత్మ. చెట్టుగా కన్పించే వస్తువులో కూడా పరమాత్మ. అన్నీ పరమాత్మకి ఇప్పుడు శరీరాలే. లోపల శరీరి ఒక్కడే ఏకము అని గుర్తించాడు. "ఏక త్వమను పశ్యతః" వాడు అన్నీ కూడ పరమాత్మకు శరీరములుగా ఒకటే అని స్పష్టముగా గుర్తించగలిగాడు గదా! ఇప్పుడు వాడికి, "మోహః కః" మోహము అంటే భ్రమ, అంటే నీవు వేరు, పరమాత్మ వేరు. చెట్టువేరు, పరమాత్మ వేరు. పరమాత్మ చెట్టుకంటే వేరా? నీ చేయూ నీ కంటే వేరా? కాదు. ఒక్కటే. అలాగే ఈ చెట్టు పరమాత్మకంటే వేరా? కాదు, ఒక్కటే. మనిషి పరమాత్మ కంటే వేరా? ఒక్కటే. అంతా ఒక్కటేనా? కాదు. పైకి కన్పించే దీనిలోపల వాడు. విడదీయ డానికి వీలులేకుండా వాడున్నాడు. కనుక ఇప్పుడు పరమాత్మ అని చెప్పవచ్చును. పైన బట్టవేసుకున్నంత మాత్రమున ఆ బట్టమనది

కాకుండా పోతుందా? నేను అన్నప్పుడు ఆ నేనులో ఈ బట్ట చేరుతుంది శరీరం కంటే అది వేరే అయినా నాది కాకుండా పోతుందా? అయితే బట్టా నేను ఒకటేనా? కాదు. బట్టనాది. అయితే బట్ట నామీద ఉన్నంతవరకూ నాతో సమానముగా అదికూడ పిలవబడుతూ వుంటుంది. నేను అన్నపదముతో బట్ట అనేదికూడా చెప్పవచ్చును. కాని అది వేరే. ఒకటిగావున్నది అని అర్థం. అలాగే వీడు ఏకత్వం దర్శించాడు కనుక మొత్తం విశ్వమంతటా వాడికిప్పుడు అజ్ఞానం లేదు. ఇదివరకు అజ్ఞానం ఏర్పడిఉంది. దేనికది వేరువేరు అనుకున్నాడు కనుక. వేరు వేరు అనుకున్నాడు కనుక ఒకడు దగ్గరకు వస్తే ఆనందిం చాడు. ఒకడు దూరం అయిపోతే ఏడ్చాడు. కాని ఇప్పుడు వీడికి ఏడుపు ఎక్కడవుంది? అన్నింటా ఉన్నా పరమాత్మ ఒక్కడే, వాడు నాదగ్గర ఉన్నాడు. వాడుంటే అన్నీ నాతో ఉన్నట్టే. ఇదివాడికెప్పుడు తెలిసింది? వాడు దానిగురించి ఆలోచన చేసిన నాడు. దానిగురించి ధ్యానం, తలంపు వాడు ఏనాడు చేస్తాడో అప్పుడు వాడికి తెలిసింది. వాడికి ఇక శోకంకాని, మోహంకాని ఉండవు సుమా. ఈ స్థితికి జనక చక్రవర్తి మంచి ఉదాహ రణ. జనకుడికి అటువంటి జ్ఞానం ఉంది. యాజ్ఞవల్క్య మహర్షి దగ్గర చదువుకొనేవాడు. ఒకనాడు శిష్యులు అందరికీ గురువుగారు మీద కొంచెం కోపం వచ్చింది. జనకుడు బుద్ధి మంతుడైన శిష్యుడగుటచేత ఆతని ముఖము చూసి చెబుతూ ఉండేవారు. డబ్బున్నరాజుగారి కొడుకు కనుక అతనినుండి ఏదో ప్రయోజనం ఆశించి పాఠం చెబుతూ ఉన్నారనుకున్నారు మిగి లిన శిష్యులు. అది కనిపెట్టారు గురువుగారు. శిష్యులకు కొంచెం జ్ఞానం కల్గించాలనుకున్నారు. మధ్యాహ్నం సుమారు 2, 3 గంట లైవుండవచ్చు. జరుగుతోంది పాఠం. కుటీరాలకు దూరంగా చెట్టుక్రింద. అక్కడ కుటీరాలు అన్నీ కాలిపోతున్నట్టుగా కన్పిం చాయి చెట్టుక్రిందనుండి చూస్తే. గురువుగారి దగ్గర పర్మిషన్



తీసుకోలేదు. శిష్యులు అంతా పరుగెత్తారు కుటీరములవైపు. ఏమున్నాయి వాళ్ళకి అక్కడ కాలిపోవడానికి? కౌపీనములు తప్పితే, పుస్తకాలు కూడా లేవాయే ఆరోజుల్లో. కాని వాటిని రక్షించుకోవటం కోసం వారందరూ పరుగెత్తారు. వెళ్ళిచూస్తే అక్కడ ఏమీ లేవు. వెనక్కితిరిగి వచ్చారు. మరికాసేపటికి మిథి లానగరం కాలిపోతున్నట్టుగా కన్పించింది. జనక చక్రవర్తి అక్కడే ఉన్నాడు. ఆతని రాజ్యమది. శిష్యులు అంతా చూసి చాలా కంగారు పడ్డారు. గురువుగారు కూడా అదిచూసి "ఏమయ్యా మిథిల కాలిపోతున్నా వెళ్ళవేం" అని అడిగారు. జనకుడు చాలా అందమైన సమాధానం చెప్పాడు "మిథిలాయాం ప్రద గ్ధాయాం నమే కించిత్ ప్రదహ్యతే" మిథిలానగరం కాలితే నాకేం కాలింది? నా వస్తువు ఏదో నాదగ్గరే ఉంది. నిప్పులకు కాలనిది, నీటికి తడవనిది, గాలికి ఆరనిది, ఎండకి ఎండని వస్తువేదో అది నా దగ్గర ఉండగా బయటి వస్తువు ఏదో తగలబడిపోతే నాకేం కనుక అంటూ జనకుడు సమాధానం చెబుతాడు. ఈ బాహ్యమైనటువంటిది ఏది ఎదురైనా, శోకంకాని, ఏది తనకి దూరమైన అతనికి శోకం ఏర్పడలేదు. కారణం అతనికి నాది, నేను అనే అహంకారం కాని, మమకారం కాని లేవు. అతనికి మోహం ఏర్పడలేదు కనుక. ఎందుకు మోహం ఏర్పడలేదు? సమస్త పదార్థములలో ఒకడే బ్రహ్మ ఉన్నాడు. నాలోనూ వాడే ఉన్నాడు అనే జ్ఞానం కలిగింది కనుక. "బ్రహ్మాత్మక జ్ఞానం" బ్రహ్మ ఏకత్వజ్ఞానం అనవచ్చుదీన్ని. విశ్వానికంతటికి పరమాత్మ శరీరిగా ఉంటే ఈ విశ్వము అంతా వాడి శరీరమని గుర్తించిన టువంటిది బ్రహ్మ ఏకత్వ జ్ఞానము. ఇది కలిగినటువంటి వాడికి అజ్ఞానము కాని, అహంకార మమకారములు ఏర్పడవు. వాడికి శోకం కూడ దూరమవుతుంది సుమా అని ఏడవ మంత్రం మనకి తెలియజేస్తోంది.

8వ మంత్రము:

సపర్యగాచ్ఛుక్ర మకాయ మవ్రణం
అస్నావిరం శుద్ధ మపాప విద్ధం
క విర్మనీషీ పరిభూః స్వయంభూః
యాథా తథ్యతో2ర్థాన్ వ్యదధా చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః

చాలా శ్రమపడి ఇంత అర్థాన్ని గుర్తిస్తామండి. దాన్ని ధ్యానము చేస్తాము. ఏమిటి లాభం కలిగేది? లాభం తెలియకుండా మనం ఏపనిలోనికి దిగం కదా! కనుక ముందు అదేమిటో మనకు తెలియాలి.

ఈశావాస్యోపనిషత్తులో ఎనిమిదవ మంత్రంమనం కనుక ఇట్లాంటి పరమాత్మ తత్వాన్ని ఏకమని గుర్తించగలిగితే, ఆయన ఈ జగత్తుఅంతా తన శరీరముగా తలంచి, తాను శరీరి అయి ఉంటాడని గుర్తిస్తే కలిగే లాభం ఏమిటో చెబుతుంది ఇక్కడ. "గుర్తించినటువంటివాడు బ్రహ్మజ్ఞాని" అని కదా అనుకున్నాం. ఇక్కడుండగా గుర్తించినవాడు తనకి ఉండే ఈ ప్రకృతి భంగాన్ని విడువగోరుచున్నాడు కనుక ముముక్షువు అని పేరు.

సపర్యగాత్, "సః" బ్రహ్మజ్ఞానము కల్గిన ముముక్షువు;

పర్యగాత్ = పొందును, ఏం పొందును? పరమాత్మతోటి సమానమైన రూపమును తాను పొందును. పరమాత్మ ఎలా వుంటాడు, "శుక్రం అకాయం అవ్రణం అస్నావిరం శుద్ధం అపాప విద్ధం"

ఇది పరమాత్మయొక్క స్వరూపం. పరమాత్మ, శుక్రం = ఆయన నిర్మలుడు. ఆయన పవిత్రుడు. నిర్మలము అంటే ఒకనాడు మలినము ఉండి తొలగినది అని అర్థము. అది జీవుడు. పరమాత్మ అనుగ్రహం కలిగితే ఆ స్థితి లభిస్తుంది. కాని పరమాత్మ సహజముగా పరిశుద్ధుడు. ఆయనలో ఎన్నడూ



మలసంబంధము ఉండనే ఉండదు. మలినము అతడిచెంతకు చేర నేచేరదు. అంటదన్నమాట. కనుక ఆయన స్వచ్ఛమైనటువంటి కాంతితోటి ప్రకాశిస్తూవుంటాడు. అకాయం = కాయం అంటే శరీరం అకాయమనగా ఆయన శరీరములేనివాడు. 'లేదాండి దేవు నికి శరీరం?' అంటే 'వుంది'. మరి కాయంలేదంటుందేం మంత్రం. అవును లేదు. ఉందా లేదా? ఉంది, లేదుకూడా. లేదు అన్నప్పుడు మనవంటి మలభూయిష్టమైన శరీరం లేదని అర్థము. ఉంది అన్నప్పుడు తనకుమాత్రమే ఉండేటటువంటి దేహం. దివ్యమంగళకరమైన విగ్రహం ఆయనది. కర్మలు అంట నిది. మాలిన్యము దరిచేరనిది. అటువంటి దేహం ఆయనకి ఉంది. అవ్రణం = కర్మమూలకమైనటువంటి శరీరం లేదుకను కనే ఆయనకు కర్మవలన ఏర్పడే దోషములు ఆ దేహమునకు అంటవు. 'వ్రణము' అంటే వ్యాధులు. అవి లేవు దానికి. మనకు ఎందుకు వ్యాధులువస్తున్నాయి. ఇందులో రకరకాల కర్మకృతమైన నాడులున్నాయి కనుక. మరి ఆతడికో, అస్నా విరం = నాడులులేవు ఆ దేహంలో. అందుకోసమని, శుద్ధం = ఎన్నడూ దానికి అజ్ఞానమనేది ఉండనేవుండదు. అపా పవిద్ధం = పుణ్యములు పాపములు అనేవి దానికి లేవు. కనుక పరమాత్మ యొక్క దివ్యమంగళ విగ్రహం ఏ ఏరకమైన కళ్యాణగుణములు కలిగిఉంటుందో, తత్‌స్వభావాన్ని గుర్తించిన ముముక్షువుకూడ పర్యగాత్ = పొందును. దేనిని? వానితో సమానమైన దివ్యమంగళ విగ్రహమును పొందును. పొందితే ఏమ వుతుంది. అప్పుడు, "కవిః మనీషి పరిభూః స్వయంభూః యాథా తథ్యతో2ర్థాన్ వ్యదధాత్ శాశ్వ తీభ్యః సమాభ్యః॥" "శాశ్వతీభ్యః సమాభ్యః" ఎల్లకాలంకూడా. అంటే ఇంతకాలము, పదేండ్లు, పది హేనేండ్లు, ఏభైఏళ్లు, వందేళ్ళుకాదు. "శాశ్వతీభ్యః సమాభ్యః" ఎప్పటికికూడా, ఏం చేస్తాడు వీడు? "యాథా తథ్యతో2ర్థాన్ వ్యదధాత్" ఉన్నవాటిని ఉన్నట్లుగా గుర్తించ కల్గుతాడు దేన్ని

ఐనాసరే. ఇక్కడకాని, అక్కడకాని, ఎక్కడకాని సర్వజ్ఞత్వం వీనికే కలుగుతుంది. కవిః = గుర్తించటానికి వీలైనటువంటి సూక్ష్మమైన బుద్ధికలిగివుంటాడు వీడు. అంటే ఎంతో కష్టమైనటువంటి, ఎంతక్లిష్టమైనటువంటి విషయాన్ని అయినా గుర్తించడానికి సూక్ష్మమైనటువంటి జ్ఞానం కలిగి ఉంటాడు. కనుక వాడు కవి. మనీషి = మనీషా అంటే జ్ఞానం. అది కలిగినవాడై ఉంటాడు. కనుక తన మనస్సు తన చెప్పుచేతల్లో ఉంచుకోగలుగుతాడు. అలాంటివాడవుతాడు వీడు. పరిభూః = వీనికీ కోరికలు ఉంటాయి. వీనికీ కోపాలుంటాయి. కాని కోరికలు భగవంతుడికి చెంది ఉంటాయి. కోపం భగవంతుడికంటే ఇతరమైనవాటి యందుంటుంది. ఎవడైతే భగవంతుడి ఉనికిని సహించలేకుంటాడో అలాంటివానియందు, బాగుచేయడంకోసం కోపం ఏర్పడుతుంది. భగవత్సేవ చేయడంకోసం కోర్కెలుంటాయి. కామం ఉంటుంది, భగవంతునియందు. క్రోధం ఉంటుంది, భగవత్ విరుద్ధమైన వాటియందు, పరిభూః, స్వయంభూః = తనయొక్క స్వరూపాన్ని స్పష్టముగా తెలుసుకున్నవాడు అవుతాడు. తననిగూర్చి వాడికన్నీ బాగాతెలుస్తాయి. ఆత్మజ్ఞానం వాడిలో పరిపూర్ణంగా ప్రకాశిస్తూ ఉంటుంది. ఇలాంటివాడై, అర్థాః వ్యదధాత్ = ఎల్లకాలము కూడ ప్రపంచంలో ఉండేటటువంటి ప్రతివస్తువుగురించి జ్ఞానమును వాడు స్పష్టముగా కలిగే ఉంటాడు. అంటే వాడికి మరణంకాని, నాశనంకాని, ఒకనాడు ఆ స్థితినుండి జారుట అనిగాని లేనేలేదు. భగవద్గీతలో కృష్ణుడు చెబుతాడు కదా. నన్నుచేరిన్నవాడు ఎప్పటికి కూడా "దుఃఖాలయం అశాశ్వతం నాప్నువంతి మహాత్మానః" అన్నట్లే అవుతారు వారంతా. దుఃఖాన్ని కలిగించే ఈ క్షుద్ర స్థితిలోనికి రానేరారని కదా పై శ్లోకానికి అర్థము! అటువంటి స్థితిని దివ్యత్వాన్ని పొందుతాడు, భగవంతునియొక్క స్వరూపాన్ని గుర్తించిన ముముక్షువు అని మనకి ఎనిమిదవ మంత్రం తెలియజేస్తోంది.



## 9వ మంత్రము:

**అన్ధం తమః ప్రవిశన్తి యేఽవిద్యాముపాసతే।**
**తతో భ ఉు ఇవ తే తమో య ఉ విద్యాయాం రతాః॥**

ఇంతవరకూ సర్వభూతాత్మకుడిగా భగవంతుని తెలిసికొని వానియొక్క అరాధనా రూపముగా కర్మలని ఆచరిస్తూ మానవుడు జీవించగలిగితే ఎప్పుడూ నశించనటువంటి దివ్యదేహంలో, దివ్యమైనటువంటి విజ్ఞానంతో ఎల్లకాలము విరాజిల్లుతూ ఉంటాడు, అని మనకు ఉపనిషత్ చెప్పింది. అయితే అంతా ఎందుకు పొందడంలేదు. ఇటువంటి స్థితిని? దానికోకారణం ఉంది. లోకంలో కొంతమంది కర్మాచరణ వేరని, తెలివి వేరని రెంటిని విడదీస్తారు. 'తెలివి' అంటే కేవలం తెలివి కాకూడదు. అది అందరికీ ఉంటుంది. జంతువులకీ ఉంటుంది తెలిసినదానిని పరిపూర్ణముగా విశ్వసించి ఉపాశించే తెలివికావాలి. దానికి భక్తి అనిపేరు. అది గుర్తించినవాడే విద్యావంతుడు అంటాము. కేవలం మామూలు తెలివి అయితే ఆహారార్జనకోసం, ఇతర సంచారముకోసమును, పశువులకి, పక్షులకు ఉన్నదికాని వాటిని ఎవ్వరూ విద్యావంతులనరు. కనుక తెలిసిన దానిని విశ్వసించి, విశ్వాసానుగుణంగా దానిని ధ్యానం చేసేటటువంటి వ్యక్తి విద్యావంతుడు అనిపించుకుంటాడు. "విద్యా" అన్నా, "ఉపాసన" అన్నా, "ధ్యానము" అన్నా "భక్తి" అన్నా ఇవన్నీ పర్యాయ పదములు, సమానమైన అర్థమును ఇచ్చేవి. ఈ విద్యకంటే ఇతరమైనది ఏదో అది మనం ఆచరించాలి. అదేది? కర్మాచరణ. మనస్వరూపానికి తగినట్టుగా ఆచరించేటటువంటివి నిత్య, నైమిత్తిక, కామ్య అనే మూడు రకములుగా ఉంటాయి అని మనకు తెలుసును. ఏమిటా నిత్యకర్మలు అంటే? మనం రోజూ ఆచరించేటటువంటి స్నానం, సంధ్యావందనం, అగ్నికార్యం ఇవన్నీ నిత్యకర్మలంటాము. నైమిత్తిక కర్మలంటే

గ్రహణాలు వస్తాయి అప్పుడప్పుడు. ఏవో కొన్ని ఆచరించవలసివస్తుంది. తెలియక ఏవో కొన్ని తప్పులు చేస్తాం దానికేదో కొన్ని ప్రాయశ్చిత్తాలు చేసుకోవలసి వస్తుంది. అది ఒక నిమిత్తాన్ని ఆశ్రయించి చేస్తున్నాము. నైమిత్తిక కర్మ అంటాము. అప్పుడప్పుడు ఏవో ఆరోగ్యం కోసమో, సంతానం కోసమో, వృష్టికోసమో, ఐశ్వర్యం కోసమో చేసే కర్మలను "కామ్య కర్మలు" అంటాము. ఈ నిత్య నైమిత్తిక కామ్యకర్మలు అంటే ఈ అన్ని కర్మలు కూడా ఆచరిస్తూనే ఉండాలి. కాని వాటి వాటి వల్ల కలిగే అవాంతర ఫలితాల్ని మాత్రం కోరి కాకుండా ఆచరించగలిగితే ఇవన్నీకూడ మనిషికి మోక్షాన్ని కలిగించడానికే సాధనాలు అవుతాయి. వాటిఫలితాలని మాత్రమే ఆశించి ఆచరిస్తే అవి ఆ తాత్కాలిక ఫలితాన్ని మాత్రమే ఇచ్చి వాడ్ని బంధిస్తాయి. ఇవి మోక్ష సాధనములు అవుతాయి అని తెలిసి ఆచరించకపోతే అవి బంధకాలు అవుతాయి కనుక, తెలివి, ఆచరణ రెండూ ప్రధానమని చెబుతారు పెద్దలు. ఎవడికోసం చేస్తున్నామో అటువంటి భగవద్ధ్యానాన్ని తెలివి అంటాం. మనం చేసేటటువంటి ఆచరణ, వాడి ఆరాధన అంటాము. తెలియలేదు కొంతమందికి. కొందరు, కేవలం మేము ఉపాసనమాత్రమే చేస్తాం, కర్మలు మాకు అఖ్ఖర్లేదు అంటారు. కొంతమంది కర్మలు వదలివేస్తే ఎలాగ, కర్మలు చేయాలి అనుకుంటారు. భగవద్ జ్ఞానం లేక కర్మలే ఫలిస్తాయనుకొని భగవద్ జ్ఞానం "విద్యా" అంటాము. కేవల కర్మని అవిద్య అంటాము. ఈరెండిటికి ఒక సంబంధం ఉన్నదని తెలియక కొందరు ఆచరిస్తారు. తెలివికలిగి ఆచరించే కర్మాచరణవలన మోక్షమే లభించి, ధివ్యమైన స్థితి లభించవలసి నప్పటికికూడ ఈరెండిటిమధ్య సంబంధం తెలియకపోవడం వలన చాలామంది దానిని పొందటంలేదు. అంటోంది ఈ ఈశావాస్యోపనిషత్ లోని తొమ్మిదవ మంత్రము.

"అవిద్యాం ఉపాసతే", 'అవిద్యా' విద్యకంటే వేరయినది



అని అర్థం. అసురులు అంటే ఏమని అర్థం? సురుడు అంటే దేవత. అసురుడు అంటే వారికంటే ఇతరమైనవాడు. విద్య అంటే భక్తి. అవిద్య అంటే దానికంటే ఇతరమైనది, కర్మాచరణ. కేవలం కొంతమంది కర్మాచరణమే చేస్తారు. వారికి ఫలితం "అంధం తమః ప్రవిశన్తి" "అంధం" చీకటి, అంధం తమః = గాఢమైనటువంటి చీకటిని వారు పొందుతారు. అంటే ఏమర్థం? పూర్తి అజ్ఞానంలోకి వారుచేరిపోతారన్నమాట. తమ స్వరూపాన్ని పూర్తిగా మరచిపోతారన్నమాట. కొంతమంది, "య ఉ విద్యాయాం" "ఉ" అంటే "ఏవ' ' అని సంస్కృతంలో అర్థం. 'ఏ' అన్న మాట. "విద్యాయాం ఉ" కేవలం భక్తి ఒక్కటే సాధనం అని ఎవరైతే దానియందు, "రతాః" = ప్రీతికలిగి ఉంటారో అంటే కర్మాచరణ వదలి పెట్టేస్తారో అన్న మాట. వాళ్ళకి ఏమౌతుంది? "తతో భూయ ఇవతే తమో" = కేవలకర్మాచరణ చేసేవారికంటే గూడా గాఢమైనటువంటి అంధకారంలోకి వారు, "ప్రవిశన్తి" = చేరిపోతారు. అంటే, అంతకంటే ఘోరమైనటువంటి అజ్ఞానం ఆవహించే స్థితిలోకి వారు వెళ్ళిపోతారని అర్థం. అని మనకి కేవల కర్మాచరణ చేసేవారు, కేవల ఉపాసన చేసేవారు ఇరువురూకూడ నష్టపోక తప్పదు సుమా అని ఈ తొమ్మిదవ మంత్రం చెబుతోంది.

## 10వ మంత్రము:

**అన్య దేవాహూర్విద్యయా - అన్యదాహూ రవిద్యయా।**
**ఇతి శుశ్రుమ ధీరాణాం - యే నస్త ద్వ్యాచచక్షిరే॥**

కేవల కర్మకానీ, కేవల ఉపాసనకానీ ఆశ్రయించిన వాళ్ళకి అంధకారం వస్తుందంటే మరి మనిషికి మోక్షం రావటానికి సాధనం ఏమిటి? ఒకచోట కర్మ చేయమని చెప్పింది మొదట్లో.

తెలివికలగాలి అని చెప్పింది ఆ తరువాత? అనే ప్రశ్నకు సమాధానం చెబుతోంది పదవమంత్రములో,

అన్యదేవాహూ ర్విద్యయా అన్యదాహూ రవిద్యయా!

"విద్యయా, అవిద్యయా, అన్యదాహూః" మోక్షానికి సాధన మేమిటి? అవిద్యయా = కేవల కర్మలకంటే ఇతరమైనవే మోక్షానికి సాధనం. అంతేకాదు, కేవల విద్యయా = కేవల ఉపాసనకంటే కూడా వేరేఅయినదే మోక్షమునకు సాధనము. మీ ఇష్టమేనా అలా చెప్పటం అనచ్చు. మాఇష్టం కాదయ్యా.

ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్త ద్వ్యాచచక్షిరే॥

వ్యాచచక్షిరే ఉపదేశం చేస్తూ వస్తోంది ఒక పరంపర. ఎవరు వాళ్ళు ఉపదేశం చేసే వాళ్ళు . ధీరులు."ధీ" అంటే బుద్ధి ఎవడైతే బుద్ధితోటి ఆనందం అనుభవిస్తూ వుంటాడో వాడు ధీరుడు."ధియా" "రమంతే" బుద్ధితోటి రమించు వారెవరో వారికి "ధీరులు" అని పేరు. ధైర్యం కలిగిన వాడు - అంటే అర్థం, సాహసం కలిగిన వాడు, చెదిరిపోని వాడు అని అంత మాత్రమే చెప్పరాదు. బుద్ధిమంతుడు అని అర్థమన్నమాట. "ధీరాణాం" బుద్ధి మంతులైన పూర్వ ఆచార్యుల యొక్క ఉపదేశాన్ని "ఇతి శుశ్రుమ" = మేం వింటున్నాం ఇలాగ, ఎవరు చెబుతున్నారు ఈ మాట? ఇలాగ వేద పురుషుడు ఉపదేశం చేస్తున్నాడు. "ఇలాగ" అంటే వేదపురుషుని కంటే పూర్వం వేరే ఎవరైనా వున్నారా? అందరి కంటే ముందు వాడే వేద పురుషుడు అంటూ వుంటారే? ఎవరూ రచించనిది వేదం. అంటూ వుంటారే! ఇక్కడ దాన్ని చెప్పిన వాళ్ళు వేరే వున్నారా? అంటే వేదం ఎప్పుడూ వుంటుంది "అపౌరుషేయం" అంటారు. ఇది ఏ పురుషుడి చేత నిర్మించబడింది కాదు. భగవంతుడి చేతకూడా నిర్మించబడింది కాదు వేదం.



మరి అయితే చెప్పిన వాళ్ళు ఎవరు? అంటే సృష్టి ఆరంభమయ్యే సమయంలో ఆ సృష్టిలో ప్రవర్తించే జీవులందరికి తెలియడం కోసమని అంతకు ముందుండేటటువంటి "ఆనుపూర్వి" అంటామే, ఎలా మొదలయింది, ఎలా నడిచింది, ఎట్లా ముగిసింది, దీనికి ఆనుపూర్వి అనిపేరు. ఈ ఆనుపూర్విని ఒకసారి జ్ఞాపకం తెచ్చుకొని, ఆ మొట్ట మొదట వుండేటటువంటి పురుషుడికి ఉపదేశం జరుగుతుంది, పరమాత్మ చేత. అలాంటివాడు మన "చతుర్ముఖ బ్రహ్మ" అంటాం కదా! సృష్టి ప్రారంభం అయిన తరువాత మొట్టమొదటి పురుషుడు ఆయనే.

పరమాత్మ యొక్క నాభి నుండి ఉద్భవించిన కమలం నుండి ఆయన వచ్చాడు. తాను సృష్టి కార్యాన్ని సాగించాడు. కనుక మొదటి వ్యక్తి అయిన అతడికి వినిపించింది "ఓహ్, నేను ఎట్లా విన్నాను" అని అనుకున్నాడు. ఆతనికి ఉపదేశం చేసిన పరమాత్మ, అంతకు ముందుండే క్రమాన్ని తను జ్ఞాపకం చేసుకున్నాడు. చతుర్ముఖునికి ఉపదేశం చేశాడు. ఇది ప్రతి సృష్టిలోనూ జరుగుతూ వుంటుంది. కనుక మనకి చెబుతోంది. "ఇతి శుశ్రుమపూర్వేషాం" "ఇతి శుశ్రుమ ధీరాణాం" అంటూ మనకి కేనోపనిషత్‌లో కూడా ఇలాగే చెబుతుంది "పూర్వేషాం ఇతి శుశ్రుమ" = మా పూర్వుల నుండి మేమిట్లా విన్నాం? అని మనకి చెబుతుంది. ఆ మొట్ట మొదట విన్న వ్యక్తిని "అపాంతర తముడు" అని పేరు పెట్టారు.

ఈ అపాంతరతముడు వేదపురుషుని ఉపదేశం తాను వింటాడు. తరువాతి వారికి చెబుతాడు. వారు తరువాతి వారికి చెబుతారు. ఇది క్రమం అన్నమాట. కనుక దీనివలన ఏమిటి మనకి తెలుస్తోంది? కేవల కర్మాచరణ కంటే, కేవల ఉపాసనకంటే కూడా మోక్షాన్ని మనకి కలిగించేది, వేరే అని మనకి పూర్వులు చెబుతున్నారు. అయితే ఏదది? కర్మ కాదంటున్నారు. భక్తి కాదంటున్నారు. భక్తి అన్నా, ధ్యానం అన్నా,

ఉపాసన అన్నా ఒకటే అని కదా మనం ఇంతకు ముందు తెలుసుకున్నాం. మోక్షసాధనాలు ఇవేవీ కాదంటున్నారు. మరేది? దీనికి సమాధానం తరువాతి మంత్రం చెబుతోంది.

## 11వ మంత్రము:

విద్యాంచా విద్యాంచ - యస్త ద్వేదోభయంగ్ం సహ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా - విద్యయా2 మృత మశ్నుతే॥

విద్య, అవిద్య అనే రెండిటికి కూడా స్పష్టమైనటువంటి నిర్వచనాన్ని ఈశావాస్యోపనిషత్ మనకి తెలియజేస్తోంది. "విద్య" అని అంటే జ్ఞానము. కానీ సామాన్య జ్ఞానం కాదు. ఇది అందరికీ వుంటుంది. జ్ఞానం వున్నందువలన కలుగవలసిన ఫలితాన్ని అది కనుక కలిగిస్తూ వుంటే దాన్ని మనం విద్య అంటాము. జ్ఞానం వున్నందువలన కలుగవలసిన ఫలితం ఏమిటి? పొందవలసిన దాన్ని పొందించాలి. తాను ఏది పొందడం కోసం ఈ జన్మ ధరించాడో, ఆ లాభం తనకు కలిగించేది అయితే అది జ్ఞానం అవుతుంది. అది అంతటా వ్యాపించిన భగవంతుని యొక్క జ్ఞానముతో కలుగవలసిన "ప్రేమ" . భగవంతుని యందు ప్రేమ కలగాలి. అపుడు తను చేసే ప్రతిపనీ ఆ భగవదారాధన కావాలి. ఆవేళ తాను భక్తుడు అని పిలువ బడతాడు. భక్తి కలిగిన వాడు, తన స్వరూపానికి తగినట్టుగ, నిత్య, నైమిత్తిక, కామ్య కర్మలని భగవదారాధనలుగా చేస్తాడు. ఇలాగ అతని వెనుకనుండే జ్ఞానం చేయిస్తుంది. కనుక ఆ జ్ఞానాన్ని కేవల జ్ఞానం అనక "భక్తి రూపాపన్న జ్ఞానము" అంటారు. దాన్నే "ఉపాసన" అంటారు. దానినే "ధ్యానము" అని అంటారు. దానినే విద్య అని అంటారు "సావిద్యా యా విముక్తయే" దానికి విద్య అని పేరు, దేనికి? ఏదైతే ఒకనికి ఎదురయ్యేటటువంటి క్లేశములు స్వయంగ తొలగించుకొనుటకు వినియోగపడుతుందో దానికి విద్య



అని పేరు. ఏ విద్య జీవుడు ఈ దేహంతోటి బంధించబడుటకు అవకాశం కల్పించే అజ్ఞానం వల్ల ఏర్పడేటటువంటి ఏవేవి క్లేశాలు వుంటాయో, అటువంటి వాటిని తొలగించుకొనుటకు వీలుకలిపించేటటువంటి జ్ఞానం, "విద్య" అన్నమాట. అదేది? కేవలం భగవదనుగ్రహమే విద్య అన్నా భక్తి అన్నా ఒకటే. దానికంటే ఇతరమైనది, తాను చేసే ఆచరణ దానికి "అవిద్య" అని పేరుపెట్టారు. ఈ "అవిద్య" అనేది కొంతమంది "మాయ" కనుక అది పోవాలి అని చెబుతూ వుంటారు.

కానీ ఇక్కడ "విద్యాంచా విద్యాంచ యస్తద్వేదోభయగ్ం సహ!"

"ఉభయం సహ" రెండిటిని సమముగా ఎవడైతే తెలుసుకుంటాడో వాడికి మాత్రమే, ఏం కలుగుతుంది? రెండింటి వల్ల రెండు ఫలితములు కలుగుతాయి. "అవిద్యయా మృత్యుం తీర్త్వా" అవిద్యచేత మృత్యువు దాటుతాడు. "విద్యయా అమృత మశ్నుతే" విద్య వలన అమృతత్వం పొందుతాడని చెబుతాడు. మృత్యువు అంటే ఏది? నీ స్వరూపాన్ని నశింపజేసేది. అది ఏది? భగవంతుడికి చెందినటువంటి వాడుగా ప్రవర్తించవలసినటువంటి జీవుడ్ని భగవంతుడి నుండి విడదీసేది. అది వీడిలో వుండే అహంకారం విడదీసి ఏం చేస్తుంది. సంసారంలోకి వీడ్ని తీసుకొని వచ్చి చేరుస్తుంది. ఎట్లా? మనకి భగవద్గీతలో కొంతమంది కేవలం వేదములలోని కామ్య కర్మాచరణములు బోధిస్తారని, కొంత మంది దానిని తెలుసుకొని "త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే". కొంతమంది కొంత ఫలితములుంటాయని కొన్నికర్మల గూర్చి తెలుసుకొని యజ్ఞ యాగాదులు చేస్తూ ఆ కామ్య కర్మల వలన కలిగేటటువంటి ఫలితములు కోరుతూ "స్వర్గాదిలోకములు" పొందుతారు. పుణ్యాన్ని అనుభవిస్తారు. "క్షీణే పుణ్యే మర్త్యలోకం

విశంతి" తిరిగి వచ్చి పాపం! మళ్ళీ యీ లోకంలో పడతారు. ఇలాగ "గతాగతం కామ కామా లభంతే" కోరికల్నే కోరుకుంటూ వెంట తిరిగేవాళ్ళు, పాపం! పోవడం రావడం, పోవడం రావడం తప్ప ఇంకేం తెలియదు. కేవల కర్మాచరణ చేసేటటువంటి వారి గూర్చి వాళ్ళు ఆ ఫలితాల్లో చిక్కుకొని తిరుగుతుంటారు సుమా అని తెలిపాడు . ఇది భగవంతుడి నుండి దూరం చేస్తుందన్న మాట. దూరం చేస్తుంది కనుక స్వరూపాన్ని నశింపజేస్తుంది అనిఅర్థం. దానికే "మృత్యువు" అని పేరు. కనుక "మృత్యువు" అంటే భగవంతుని నుండి దూరం చేసి ఆత్మ స్వరూపం నశింపచేయుటకు మార్గం తెరిచే, అహంకారమనే సంసారం అన్నమాట, దాటడం ఎట్లా? మనకీ ఉపనిషత్తులు చెబుతున్నాయి.

"అవిద్యయా మృత్యుం తీర్త్వా" అవిద్యయా = అవిద్య చేత నీవీ అహంకార రూపం అయిన సంసారం దాటుతావు అనిచెబుతోంది. అవిద్య అంటే అజ్ఞానం అయితే అజ్ఞానంతోనా మనం సంసారం దాటుతాం? అజ్ఞానంలో మరింత సంసారంలో చిక్కుకుంటాం. కానీ మరిక్కడ దాటుతాం అని చెబుతోందే. కనుక అవిద్య అంటే కేవలం అజ్ఞానం కాదు.కర్మాచరణ, ఏం కర్మాచరణ? ఫలితములు కోరుకునే కర్మాచరణయా? కాదు. మరి ఎటువంటి కర్మాచరణ? మొదటి రెండు మంత్రములు మనకి చెప్పినట్టుగా, చేసేటటువంటి పని నేను కాదు, వెనుక ఉండేటటువంటి ఆ ఈశ్వరుడు చేయిస్తున్నాడు. ఇది ఎవరి వల్ల సాగుతోంది? నా వలన కాదు. నా వెనుకుండి నడిపించే పరమాత్మ వలన. ఎవడి కోసం జరుగుతోంది ఇదంతా? ఆ పరమాత్మ కొరకు ఫలితం వాడిది అంటూ ఫల, సంగ, కర్తృత్వ, త్యాగ పూర్వకముగా కర్మ ఆచరణ తాను చేయగలిగితే, ఈ కర్మాచరణ వలన వాడికుండేటటువంటి ప్రాచీన మైనటువంటి రుచులు, వాసనలు తొలగుతాయి. ఇప్పుడు వాడేమవుతాడు?



భగవంతుని యందు ప్రేమకలిగింది? ఆ భక్తి తోటి ప్రేమను ఆర్జించాడు జ్ఞానం ప్రేమగా పండింది. దానికి "విద్య" అని పేరు. ఇపుడీ విద్యచేత భగవదనుగ్రహం వాడి మీద కలుగుతుంది. అపుడు "అమృతత్వం అశ్నుతే" అపుడు అమృతత్వం, స్వస్వరూప సాక్షాత్కారం పొందుతాడు. భగవంతుని యొక్క దివ్య సన్నిధానం పొందుతాడు. అర్థాత్, "అవిద్యయా" అంటే ఫలము కోరకుండా ఆచరించే కర్మచే. ఇది కూడా "భగవంతుని సేవ" అని చేసేటటువంటి చక్కటి సేవవల్ల తాను అహంకార రూపమైనటువంటి సంసారమును దాటుతాడని, విద్యయా = ప్రేమచేత, భక్తిచేత, తాను భగవంతుని యొక్క సన్నిధానం పొందుతాడని మనకీ పదకొండో మంత్రం విద్య, అవిద్య అనే శబ్దాలకి అందమైన అర్థం చెప్పి, అవిద్యా= అంటే నిష్కామ కర్మ అంటాము దాన్ని. విద్య = భగవత్ ప్రేమ ఈ రెండూ వుండాలి. మన భగవద్రామానుజులు చెబుతారు. జ్ఞానంతో కూడుకున్న కర్మ కావాలి. అపుడు మాత్రమే ఎలా చేయాలో తనకి తెలుస్తుంది. ఉత్త కర్మ చేస్తే ఏం లాభం.తప్పు దార్లు పట్టవచ్చును. కేవలం మేము కర్మ చేయం అనికొందరంటే కేవలం, జ్ఞానం చాలును అన్నారు కొందరు. కర్మ చేయకుండా శరీరం ఎలా వుండనిస్తుంది? ఏదో ఒక పనిలోకి తోస్తుంది వాడిని. అలాగే కేవల జ్ఞానం ప్రమాదకరం. కేవల కర్మ ప్రమాదకరం. ఎలా వుండాలి? జ్ఞానముతో కూడుకున్న కర్మ కావాలి. అది, దీనికి భగవంతుని కోసం కావాలి. భగవంతుని యందు ప్రేమతో సాగాలి. అపుడు మాత్రమే భగవత్ ప్రేమ వానికి శ్రేయస్సుని కలిగిస్తుంది. కర్మాచరణ వాడి కుండేటటువంటి ప్రాచీన వాసనలను, బంధము కలిగించే అజ్ఞానమును, లేక అహంకారమును తొలగిస్తుందని, కర్మ జ్ఞానములతో సహకరించే భక్తి, మోక్ష సాధనము తప్ప, కేవల కర్మకాదు, కేవల భక్తికాదు, అని ఇంతకు ముందు రెండు మంత్రములూ కూడా

కేవల విద్యని కేవల అవిద్యని తెలుసుకున్న వాళ్ళు ఇద్దరూ కూడా నష్టాన్ని పొందుతారు. ఈ రెండిటికంటే వేరయినవే మోక్ష సాధనములు అని, అది, కర్మ జ్ఞానములతో సహకారము కలిగినటువంటి ఆ కర్మ జ్ఞానముల వలన కలిగినటువంటి భగవత్ ప్రేమ రూపాపన్నమైనటువంటి భక్తి, భగవదుపాసన, లేక ధ్యానము. ఇది మాత్రమే మోక్షమునకు సాధనం, అని పదకొండో మంత్రం తెలియజేస్తోంది.

## 12వ మంత్రము:

**అన్ధం తమః ప్రవిశన్తి - యేऽసంభూతిముపాసతే।**
**తతో భూయ ఇవ తే తమో - య ఉ సంభూత్యాం రతాః॥**

కర్మ, జ్ఞానము, ఇవి రెండూ అందముగా భక్తిని కలిగిస్తే తాను చేసేటటువంటి ఉపాసన మోక్షాన్ని కలిగిస్తుందని మనం ఇంతవరకూ తెలుసుకున్నాం. అయితే ఇపుడు మోక్షం అంటే ఏమిటి? విడుచుట అని అర్థం. అయితే ఇపుడు విడచుట అన్నది ఎలా వుండాలి అని 12వ మంత్రం దగ్గర నుండి మూడు మంత్రాలు తెలియచేస్తాయి.

"భూతి" అంటే ఐశ్వర్యము అని సంస్కృతంలో అర్థము." విభూతిర్భూతి రైశ్వర్యం" అనికదా నిఘంటువు! కొంతమందికి కేవలం మనం పొందదగినది ఏమిటి అని, "సంభూతి" =; సం= మంచిగ, సమానముగ తాను పొందేటటువంటి సంపద.

ఇది ఎలా వుండాలి? ఏదో ఒకటి పొందాలి అనుకుంటారు. దానికి ఆటంకముగా ఇక్కడకు వచ్చి ఈ శరీరంలో బంధించబడి వున్నాం. కనుక కొందరు ఏం కోరుకుంటారంటే, ఈ శరీరంలోంచి విడుదల కావాలని కోరుకుంటారు. మరి కొందరు, భగవంతునితో ఏకమయ్యేటట్లుగా, భగవంతునితో ఏకముగా



చేరాలి అని కోరుకుంటారు. "సం ఇతి ఏకీకృత్య" అంటాం. కనుక "భూతి" సంపద. ఎటువంటి సంపద? భగవంతునితో సమానముగా వుండే సంపద. భగవంతునితో సమానమైనటువంటి సంపద "సంభూతి". ఇపుడు మనం, ఒక్కటి అనదగినట్లు సంసారంలో చుట్టుకొని వున్నాం. దీని నుండి విడుదల కావాలి అని కోరుకుంటాం. రెండు కోరికలు. ఏమిటవి? ఒకటి. ఇపుడుండే దీంట్లోంచి విడుదల కావాలి. రెండవది భగవంతుడి దగ్గరకు చేరాలి. కనుక భగవంతుడి దగ్గరకు చేరాలి అంటే, దానికి "సంభూతి" అని పేరు. ఇక్కడ వుండేటటు వంటి దీని నుండి విడుదల కావాలంటే, దీనితో వుండే పట్టు వదలాలి. కనుక దీనికి "అసంభూతి" అని పేరు. శరీరమును వదలుటకు అసంభూతి అనిపేరు. భగవంతుని చేరుటకు సంభూతి అని పేరు. లోకంలో కొంతమంది ఏమనుకుంటారంటే.

"అన్ధం తమః ప్రవిశన్తి యేऽసంభూతి ముపాసతే!"

నేను ఇందులో నుండి విడిపోతే బాగుండును. ఈ శరీరం పాడు శరీరం. పోతే బాగుండును అనుకుంటారు. అలా దీన్ని వదలుటకు ప్రయత్నం చేస్తారు. అలా కేవల శరీరమును వదిలి పెట్టేసినటువంటి వారు, ఘోర నరకాన్ని పొందుతారని చెబుతోంది. అయితే ఏం చేయాలండి? భగవంతుని చేరాలి అని కోరుకోవాలా? ఓ అలాగే కోరుకుంటాము "మేము సంభూతినే కోరుకుంటాము ఇక్కడ ఉండియే" అంటారు కొందరు.

"తతో భూయ ఇవతే తమో య ఉ సంభూత్యాం రతాః"

కేవలం భగవంతుడ్ని మాత్రమే చేరాలి. అని కోరుకునే వాళ్ళుంటారే, దానియందు రుచి కలిగిన వారుంటారే, వాళ్ళు అంతకంటే నరకాన్ని ఎక్కువ పొందుతారు. అంటే, శరీరం పోవాలి అని కోరుకునే వారు కూడా నరకానికి పోతారు. భగవంతుడ్ని చేరాలి అనుకునేవారు నరకానికి చేరక తప్పదు సుమా! అని ఈ మంత్రం మనకి చెబుతుంది. భక్తి వలన కలిగే

స్థితి, శరీరం వదలడం కాదు. భగవంతుడ్ని పొందడం కాదు అని చెబుతుంది 12 వ మంత్రంలో. ఆశ్చర్యముగా వుందే. అది కాదా? దానికి తరువాతి మంత్రం సమాధానం చెబుతుంది.

## 13వ మంత్రము:

అన్యదేవాహు స్సంభవాత్ - అన్యదాహు రసంభవాత్।
ఇతి శుశ్రుమ ధీరాణాం - యే నస్త ద్విచచక్షిరే॥

నువ్వు మోక్షం పొందదలిచావు. అది వుందే. అది అసంభవాత్, సంభవాత్ అన్యదేవ, సంభవాత్ = కేవలం శరీరంపోకుండా భగవంతుడ్ని చేరడం అని అనుకుంటే అబ్బబ్బే అది కాదు, అసంభవాత్ = అయితే ఈ శరీరము నుండి విడి పోవడం కేవలం అనుకుంటే, అది కాదు. ఈ రెండిటికంటే అది విలక్షణమైనది. ఎవరు చెప్పారండీ మీకు? "ఇతి శుశ్రుమ ధీరాణాం" బుద్ధిమంతులైనటువంటి మా పెద్దలు, దీన్ని చెబుతూ వుంటే మాకు మేం విన్నాం. "యే నస్త ద్విచచక్షిరే", ఎవరైతే మనకి దీనిని స్పష్టముగా ఉపదేశం చేశారో అలాంటి పూర్వులైనటువంటి వారు, జ్ఞానులైనటువంటి మహానుభావుల నుండి మేము నేర్చుకున్నాం. ఈ శరీరం విడచి పెట్టడం కాదు. కేవలం భగవంతుడ్ని చేరడం మాత్రమే కూడా కాదు సుమా! ఈ రెండిటికంటే అది వేరు. అని చెప్తోంది పద మూడో మంత్రంలో. ఇంతకంటే వేరయినది అంటే ఏమిటి? దానికి సమాధానం చెబుతోంది పధ్నాలుగో మంత్రం.

## 14వ మంత్రము:

"సంభూతించ వినాశంచ - యస్తద్వేదో భయగ్ం సహ।"
వినాశేన మృత్యుం తీర్త్వా - సంభూత్యామృత మశ్నుతే॥



కొంతమంది కేవలం శరీరం వదలి పెట్టడమే ఫలితం అని శరీరం వదలి పెట్టేస్తూ వుంటారు. ఏమిటి వాళ్ళగతి? అంటే వీళ్ళ శరీరం వదలి పెట్టడమే ఒక లక్ష్యం తప్ప చేరవలసినది ఏమిటో వీరికి తెలియదు. అలాంటి వారికి మోక్షం లేదు. వాళ్ళు "ప్రేత" అయి తిరుగుతూ వుంటారు. అక్కడక్కడ, లేదా, కొంతమంది భగవంతుని చేరడం తెలియక కేవలం తనని మాత్రం తను తెలుసుకుంటే చాలునని శరీరమును వదలి పెట్టి వెళ్ళిపోతారు. క్షుద్రమైనటువంటి రూపంతో ఎక్కడో ఒక మూల కూర్చుంటాడు, ఒంటరిగా, ఏకాకిగా. వాడికి ఆనందం వుండదు. కొంతమంది భగవంతుడ్ని చేరిపోదాం అనుకుంటారు. కానీ భగవంతుడ్ని చేరాలి అంటే ముందు ఆటంకమైన ఈ శరీరము వదలవద్దా! శరీరం ఆటంకం కాదు. మనసుకు పట్టిన వాసనలు తొలగాలి. లోపలి జీవుడ్ని అంటుకుని ఉండేటటు వంటి ఏ ప్రాచీనమైన ప్రకృతి సంబంధాలు వుంటాయో, అవనీ పోతే తప్ప వీడు ఇందులో నుండి విడుదలగుట అనేది వుండదు కదా! వాడు కేవలం శరీరాన్ని విడచి పెట్టేస్తే, నిలవ వుండే ప్రాచీన కర్మను అనుసరించి మరొక దేహములోకి పోక, తప్పదు కదా! అందుచేత కేవలం భగవంతుడ్ని పొందడం అనే రుచి మాత్రం ఉంటే చాలదు. దానికి కావలసిన, వెనుక నుండేట టువంటి వాసనలు తొలగడం కావాలి. శరీరపు పట్టు తొలగడం కావాలి. చిట్టచివరి కర్మకూడా వీడినుండి విడచి పెట్టేసేయాలి. దానికి కావలసినది ఆచరణ. అది చేయాలి. కనుక ఇప్పుడు వీడు ఏంచేయాలి? శరీరంలోంచి వెళ్ళిపోవడం మాత్రం కోరితే చాలునా? చాలదు. అలాంటి వాడికి మోక్షము కలుగదు. భగ వంతుడ్ని మాత్రం చేరుకోవాలి అని కోరుకుంటే చాలా? లేదు. ఈ పట్టు వుండగా వాడ్ని చేరడం అసాధ్యం. అయితే వీడు ఏం కోరుకోవాలి? "సంభూతించ వినాశం", అసంభూతి అన్నా వినాశం అన్నా రెండూ ఒకటే. "వినాశం" శరీరపు పట్టు

నశించుట అని అర్థము. అసంభూతి అన్నా అదే అర్థము. ఈ రెండిటినీ కలిపి తెలుసుకోవాలి. అంటే శరీరము ధరించుటకు కారణమైనటువంటి కర్మ, వాసనల పట్టు తొలగుట అనేది ముందుండి, దీనితోటి కలగాల్సిన భగవదనుభవం కూడా దీనితో పాటు కలగాలని, ఈ రెండూ కలిపి కోరుకోవాలి. ఇంతకు ముందు నిష్కామ కర్మతోటి తాను చేసేటటువంటి ప్రేమ రూపాపన్నమైనటువంటి 'ఉపాసన' లను మనము అంగము, అంగి అని తలచినట్లే శరీరము విడుట అనేది కూడా అంగముగా తలచి, భగవంతుని పొందుట అనేది అంగిగా తలవాలి. ఇది తను కోరవలసిన కోరిక తప్ప, కేవలం విడి పోవాలని కాదు. కేవలం దాన్ని చేరాలని కాదు. కేవలం ఇది పోవాలని కోరినా, కేవలం అది చేరాలని కోరినా, వాడికి కలిగేది నష్టమే. ఘోర నరకమే. శరీరము తొలగుట అనేది అంగము. కనుక 'అసంభూతి' అనేపదము అంగమును తెలుపుతోంది. 'సంభూతి' భగవంతుని యొక్క ప్రాప్తి అనేది "అంగి" ని తెలియజేస్తుంది.

ఈ రెండిటినీ కలిపి "ఉభయగ్ం సహ యస్తద్వేద" ఈ రెండూ 'అంగము-అంగి'గా వుంటాయి. అని ఎవడైతే తెలుసుకుంటాడో వాడికి ఏమవుతుంది? "వినాశేన మృత్యుం తీర్త్వా" కర్మ యొక్క సంపర్కం తొలగింది. కనుక భగవంతుడి నుండి దూరంగా వుంచే సంసారంతోటి వీడికి పట్టుతప్పింది. దాటాడు వీడు దీన్ని. "సంభూత్యా" = భగవంతుడి సాయుజ్యంవల్ల. "అమృతత్వమశ్నుతే" = భగవంతునియొక్క నిత్య సన్నిధానం అనేటటువంటి అమృతత్వాన్ని వాడు తప్పకుండా పొందుతాడు సుమా అని ఈ రెండూ కలిపి తెలుసుకోవాలని ఈశావాస్యోపనిషత్ తెలియచేస్తోంది. అంటే ఈ మంత్రంలో జ్ఞాపకం పెట్టుకోవలసినది "భూతి" అంటే సంపద; సం= భగవంతునితో సమానమైన అనుభవస్థితి.

ఇది ఎప్పుడు కలుగుతుంది. వాడి అనుగ్రహంతో? వాడి



సన్నిధానం చేరినపుడు. అది ఎప్పుడొస్తుంది? దానికి ఆటంకముగా వుండే, కేవల శరీరం పోవాలి అనేదే కాదు, అక్కడకు పోతే వేరే శరీరం వస్తుంది, కానీ ఇటువంటి కర్మకృత పాంచ భౌతిక శరీరం పోవాలి. ఇది నశించాలి. పూర్తిగా నశించాలి. కనుక 'వినాశం' అనిపేరు. దీనితో, ఇప్పటిదాకా శరీరంతో వుంది పట్టు. ఇదే సంపదలు అనుకుంటాం. ఇది సంభూతి అనుకుంటూ పొరపడ్డాం. కాదు కాదు ఇది 'అసంభూతి; అని తెలియాలి. ఇది వదలి పోవాలి అని తెలియాలి. కనుక కర్మలయొక్క పూర్తిగా వినాశం, ఆపై ప్రాకృత శరీర సంపర్క విరహితుడై భగవంతుని యొక్క నిత్యసన్నిధానాన్ని సాయుజ్యమును పొందాలి. అప్పటి దివ్య ఆనందం వుండే, అది మోక్షం సుమా! అని మనకి ఈ మూడు మంత్రాలు చెబుతాయి.

పరమాత్మ యొక్క స్వరూపాన్ని, పరమాత్మ యొక్క స్వభావాన్ని, ఈ జగత్తు అంతా ఆయన వ్యాపించి వుంటాడని, ప్రతి అణువునా తాను నిండి వుంటాడని, ఆ పరమాత్మని చేరుటకు కర్మతోటి కూడుకున్న జ్ఞానం, దానివలన పండినటువంటి భక్తి ఉపాయమని, అలాంటి ఉపాయ ఆచరణ ద్వారా ఈ జీవుడు తనకి ఇపుడు ప్రస్తుతం ఉండేటటు వంటి పంచ భౌతికమైనటు వంటి, కర్మకృతమైనటువంటి దేహమును వదలడం, పరమాత్మ యొక్క దివ్యసన్నిధానం చేరడం, ఫలం, అని పధ్నాలుగు మంత్రముల వరకు ఈశావాస్యోపనిషత్ తెలియజేసింది.

**15వ మంత్రము :**

**హిరణ్మయేన పాత్రేణ - సత్యస్యాపిహితం ముఖమ్।**
**తత్త్వం పూషన్నపావృణు - సత్యధర్మాయ దృష్టయే॥**

పదిహేనవమంత్రమునుండి నాలుగు మంత్రములలో, పరమాత్మని ఈ జీవుడు ఎలా ప్రార్థన చేయాలి తాను పొంద

దలచినటువంటి ఫలితము పొందుట... ...నేది వివరిస్తోంది. జీవుడు భగవంతుడ్ని ప్రార్థన చేయాలి. మనస్సు స్వాధీనంలో ఉండాలి. కానీ ఈ మనస్సు దానికి బయటవుండే ఇంద్రియాల యొక్క ప్రభావంచేత, ప్రాపంచిక విషయాలనే ఎప్పుడూ కోరుతూనే వుంటుంది తప్ప, తనలోపల వుండేటటువంటి ఆత్మ తత్వమును చూచుటకు ఇచ్ఛగించదు. రంగులు, వాసనలు, రుచులు, మొదలైనవి ఇంద్రియాలచేత కోరబడి, ఆ ఇంద్రియములకు నాయకుడు అయినటువంటి మనస్సును తమవైపు లాగుతుండటంచేత, లోపల ఉండేటటువంటి వాటిని చూడటం మనస్సుకి కష్టం అవుతుంది. కానీ ఆత్మయొక్క జ్ఞానం, మనస్సుద్వారా మాత్రమే బయటకు ప్రసరించవలసిన అవసరం వుంది కనుక ఆ మనస్సు తన యందుండేటటువంటి రుచులనీ, వాసనలని సరైన మార్గంలో పెట్టుకోగలగాలి. అయితే మనస్సా పెట్టుకోగలదు? లేక మనమా స్వాధీనంలో పెట్టుకోగలం మనస్సుని? కాదు. ఈ మనస్సుని పోషించేవాడెవడో, వాడు ఈ మనస్సుని అదుపులో పెట్టాలి. కనుక ముందు, ఆ మనస్సుని నడిపించేటటువంటి, పోషించేటటువంటి ఆ పరమాత్మని, మనస్సు తనయొక్క స్మరణ చేయుటకు అనుకూలంగా వుండేటట్టుగా పెట్టుకో అని ప్రార్థన చేస్తూ, దానికంటే ముందు, ఆ మనస్సుపై వుండేటటువంటి రకరకాల రుచులు వుంటాయే, వాటన్నిటిని కొంచెం ప్రక్కకి తొలగించి, లోపల వుండే నిన్ను కోరేటట్టుగా నీ స్వరూపం చూసేటట్టుగా అనుగ్రహించు అని 15వ మంత్రంలో ప్రార్థన నేర్పుతోంది ఈశావాస్యోపనిషత్.

ఆత్మ ఎప్పుడూ ఏకరూపంగా ఉండేది కనుక దానికి "సత్యం" అనిపేరు. ఈ సత్యం అని పేరు గలిగిన ఆత్మకి ఒక ధర్మం వుంది. అది "భగవంతునికి చెంది వుండుట". అది ఇక్కడ వున్నా, అక్కడ వున్నా, ఎక్కడ వున్నా, పరమాత్మకే చెంది, వాడిచేత నడుపబడుతుంది కనుక ఈ 'సత్యధర్మము'



పరమాత్మని గుర్తించుట కాని, గుర్తిస్తోందా ఈ వేళ? లేదు. కారణమేమి? బంగారమెట్లా మనస్సులని ఆకర్షిస్తుందో, ప్రాపంచిక విషయములు అన్నీ కూడా బంగారు పాత్రవలే మనస్సుని తమవైపు లాగుతాయి. "హిరణ్మయేన పాత్రేణ", ఈ ప్రాపంచిక విషయములచేత, సత్యస్య = ఆత్మయొక్క; ముఖం = ద్వారము వలే వుండే మనస్సు అపిహితం = మూసివేయబడినది. ద్వారం తెరిస్తే కానీ లోపల ఉండేది కనిపించదు. కనుక ఈ జీవుని యొక్క, పరమాత్ముని చూచుటకు అవకాశం కల్పించే ద్వారమైన, మనస్సు మూసివేయబడివున్నా, హే పూషన్ = మనస్సుని, ఆత్మని పోషించువాడా! అని అర్థం. ఏం చేయాలి? త్వం అపావృణు = మనస్సు పైన ఏర్పడి వున్న విషయవాంఛ అనే ఆచ్ఛాదన వుందే, ఈ కప్పు వుందే, దీనిని తొలగించు అంటూ ప్రార్థన చేస్తున్నాం ఈ మంత్రంలో. పూషన్ = సూర్యుడా అనికూడా అర్థం వుంది. బాహ్యంగా శరీరమును పోషించే వాడు "సూర్యుడు". శరీరాన్ని, లోపల ఉండేటటువంటి తత్వాన్ని కూడా పోషించేవాడు, సూర్యునికి కూడా అంతర్యామిగా వుండేటటువంటి "శ్రీమన్నారాయణుడు".

శబ్దార్థాన్ని తీసుకున్నా, పూషన్ = పోషించువాడు కనుక పరమాత్మే. లేదా ఈశావాస్యం అని మొదటి మంత్రంలో చెప్పినట్టుగా, పైన కనిపించే సూర్యగోళాన్ని తీసుకున్నా ఆ గోళమునకు లోపల ఉండే జీవుడికి కూడా లోపల వ్యాపించి యుండి, నడిపించేటటువంటి, జగత్తును పోషించేటటువంటి "పరమాత్మ" అని అర్థం.

మనం రోజూ ప్రార్థన చేస్తూ వుంటాం కదా "ధ్యేయస్సదా సవితృమండల మధ్య వర్తీ నారాయణః" అని. ఆతడ్ని ఈ మంత్రం ద్వారా, మనస్సు పై వుండే ఆచ్ఛాదన తొలగించి, లోపల వుండేటటువంటి ఆత్మ, పరమాత్మకి చెందినది అనే

దర్శానికి గుర్తించుటకు తగినట్టుగా అనుగ్రహించమని ప్రార్థన చేస్తాం.

**16వ మంత్రము :**

**పూషన్నేకర్షే! యమ! సూర్య! ప్రాజా పత్య!**
**వ్యూహరశ్మీన్ సమూహ తేజః**
**యత్తేరూపం కళ్యాణతమం తత్తేపశ్యామి**
**యోసావసౌ పురుష స్సోహమస్మి**

పరమాత్మని ప్రార్థన చేయుటకు ఆయన స్వరూపం మనకి తెలియాలి. లోకములో ఆకర్షకములు అయినవి మనసుని తమ వైపు త్రిప్పుకుంటే, అంతకంటే ఆకర్షకమయినది కనిపిస్తే తప్ప మనస్సు వాటిపై నుండి మరోవైపు తిరుగదు. వేరే వాటిని చూడదు. భగవంతునికి అటువంటి రూపం ఒకటుంది. లోకంలో కనిపించే అందాలన్ని దానిలోంచి వస్తున్నాయి. ఇది భగవద్గీత మనకి తెలియచేస్తోంది. లోకంలో కనిపించే వస్తువులన్నిటికంటే గొప్పదైన, ఆకర్షకమైన, క్షేమంకరమైన ఒక దివ్యస్వరూపం ఆ భగవంతుడికి ఉంది. అది భక్తుడు ఏర్పరచినట్లు వుంటుంది అని మొదట మనకి శాంతి మంత్రంలో "పూర్ణమేవ అవశిష్యతే" అని తెలియచేసింది. "అలాంటి నీయొక్క స్వరూపాన్ని, నేను గుర్తించగలిగేటట్లుగా, హే భగవన్! నీవు ఏనాడు అనుగ్రహిస్తే ఆనాడు నేను, నిన్ను ప్రార్థన చేయగలుగుతాను. కనుక నీవు నాకు అటువంటి రూపాన్ని దర్శింపచేయ సమర్థుడవు సుమా!" అంటూ భగవంతుడ్ని ప్రార్థించడం నేర్పుతోంది. ఏమని? ఆ భగవంతుడికి కొన్ని పేర్లు, మనం అనుసంధించవచ్చును. ఇలాగ

**"పూషన్! ఏకర్షే! యమ! సూర్య! ప్రాజాపత్య!**
**వ్యూహరశ్మీన్! సమూహ తేజః**



**యత్తేరూపం! కళ్యాణ తమం! తత్తే పశ్యామి**
**యోసావసౌ పురుషస్సోహమస్మి"**

ఇలా ప్రార్థన చేస్తామట.

ఎవడతను? "పూషన్" అని పిలుస్తున్నాం. పూషన్ సూర్య అంతర్యామి లేదా విశ్వాన్ని పోషించువాడా! ఏకర్షే= అద్వితీయుడైనటువంటి హే ఋషీ, అని అర్థం. ఋషి= ముందు చూపు కలవాడు. వెనుక జరిగింది తెలిసినవాడు. జరుగుతున్నవాటిని వాటితో అన్వయించ నేర్పు కలిగిన వాడు. క్రాంత దర్శి అంటాము. భగవంతుడు, ఋషి అయితే లోకంలో ఋషులు చాలామంది వున్నారు. అలాంటి ఋషికాదు పరమాత్మ.

తన అనుగ్రహం తోటి వీరంతా ఋషులు అయితే, తనకి ముందు వెనుకలు చూపుటకు మరొకడి, అనుగ్రహం అక్కర్లేని ఋషి ఆయన. కనుక 'ఏక, అద్వితీయుడు అయినటువంటి ఋషి. క్రాంతదర్శి. హే భగవన్, నేను ఇంతకు పూర్వం ఎలా ప్రవర్తించానో నీకు తెలుసును. ఇకపై నేను ఎట్లా వుండాలో నీకు తెలుసును. ఇపుడు నేను ఎట్లా వున్నానో నీకు తెలుసును. ఎలా మార్చుకోవాలో నీకు తెలుసును. నీకు అనుకూలంగా మార్చుకో అని మనకి భావం కలిగినట్లుగా "ఏకఋషీ", అయితే మనం వాడు చెప్పినట్లు వింటామా? ఆ! భగవన్! నీ పేరేమి? 'యమ'. యమ అనగా నియమించువాడు అని అర్థం. నువ్వు నియమించేవాడివి. నేను నియమిస్తే మాత్రం, మీరు ప్రవర్తిస్తారా? బాగుపడతారా నేను చెప్పినట్లుగా? అంటావేమో ఆ సంశయం నీకొద్దు. నీవు "సూర్య", "సుష్టు ఈరయతి"= బాగా వీరందరినీ పెంచువాడు. కనుక ఆయన్నూ సూర్య అని అంగీకరిస్తున్నాం. అంతేకాదు "ప్రాజాపత్య" = ఈ జీవులు అందరికీ కూడా నీవు పతివి. పరిపాలించువాడవు. ఏం చేయాలి అయితే? "వ్యూహరశ్మీన్" = నీవు చాలా గొప్ప కాంతి కలిగిన

వాడవు. ప్రాకృతగోళమైనటువంటి ఈ సూర్యుడే ఇంత కాంతిగలవాడైతే, ఆతడిని పోషించే భగవానుడి కాంతి ఎంత? కొన్ని కోట్లమంది సూర్యుళ్ళు ఒక్కసారిగా ఉదయిస్తే కూడా ఆతని కాంతిముందు ఖద్యోతములే అవుతాయి. అంత కాంతి కలవాడు ఆయన. అయితే అంతకాంతి కలవాడిని చూడగలమా మనం? చూడలేము. అద్వితీయమైన ప్రకాశముకల అతని కాంతి మిరుమిట్లు గొలుపుతూ మనకి ఆయనని చూసేందుకు వీలు లేకుండా చేస్తోంది. "రశ్మీన్ వ్యూహ" = నీ కిరణములను ఒక్కసారి ప్రక్కకి తొలగించు. అంతేనా?

"సమూహ తేజః" = నీ యొక్క దివ్యమైనటువంటి తేజస్సుని నేను చూచుటకు వీలుగా ఒక చోటకి చేర్చు. ఆకాశమంతా వ్యాపించిన కిరణములు నీవి. ఒక భూతద్దం పెట్టి అన్ని కిరణాలను ఒకచోటకు తీసుకొని వచ్చి మనం చూడగలుగుతున్నామే, అలాగే భగవన్ నీయొక్క, సర్వజగత్తు వ్యాపించినటువంటి కిరణములనన్నిటినీ ఒకవైపు; సమూహ = చేర్చు. అపుడు నీయొక్క రూపాన్ని నేను చూడ గలుగుతాను. ఎట్లాంటి రూపాన్ని? భయంకరమైన రూపాన్ని చూపుటకు వీలు లేదు. మరి? "యత్తే రూపం కళ్యాణ తమం" = నీ అద్భుతమైనటువంటి, అద్వితీయమైనటువంటి దివ్యమోహన ఆకారం వుంటుందే, అటువంటి ఆకారాన్ని నాకు చూపు. అది నేను చూడగలుగుతాను తప్ప, అం[illegible]గా వ్యాపించిన రూపాన్ని నేను చూడలేను. అది ఎక్కడ క[illegible]స్తుంది మనకు? మనకంటితోటి చూచుటకు వీలయినటువంటి చిన్నరూపముగ మనం అర్చించేటట్లుగ "పూర్ణమేవ అవశిష్యతే" భగవంతుని యొక్క ఐదవ స్వరూపం "అర్చామూర్తి", కలదు కదా. దాన్ని చూపు. అయితే ఇక్కడ ఉండేటటువంటి ఈ రూపం చైతన్యం కలిగినదా? లేనిదా? "యోసావసో పురుషః సోహమస్మి" = కేవలం



ఇక్కడ వుండేటటువంటి మూర్తిలో, ఏ పరమాత్మ తత్వం వ్యాపించివుందో ఇదే తత్వం సూర్యుడిలో ఉంది. అదే తత్వం నాలో కూడా వుంది. కనుక ఇవన్నీ కూడా భగవంతుని స్వరూపాలే. అయితే, ఇక్కడ శరీరమేకన్పించి భగవత్ స్వరూపం లోపలవుంది అనిపించదు మనకుండేటటువంటి ప్రకృతి సంబంధంచేత. బయట కనిపించే వస్తువులని భగవత్ స్వరూపములు అనుటకు వీలు లేనట్లుగా, అవే అవే కొన్ని కార్యములలో నియుక్తములై యున్నాయి. కానీ కొన్ని పేర్లకు పరిమితాలై ఉన్నాయి. అర్చామూర్తిగా ఏర్పరచి ఉన్న రూపాన్ని, 'వాడు' అని పేరుతోను రూపముతోనూ గుర్తించ వీలు అవుతుంది. కనుక వాడిని నేరుగా ఆశ్రయించవచ్చును. కనుక "అసౌ" = ఇక్కడ చూపబడేవాడు "అసౌ" = ఆకాశంలో చూపబడేవాడు, అసౌ అసౌ పురుషః = ఇందులోనూ, అందులోనూ, ఇదిగో, ఇదిగో అని పేరుపెట్టి చూపగల్గినవాడు, "యః పురుషః" ఏ పరమాత్మ తత్వమున్నదో, అదే పరమాత్మ తత్వం, "అహం"= నేను అని కూడా పిలువబడుతుంది. ఏం అర్థం? అక్కడ ఒక గోళం, గోళంలో పరమాత్మ వున్నట్టే, ఇక్కడ కనిపించేటటువంటి "అహం" అనే పేరుతోటి పిలుచుకుంటున్నానే ఈ వస్త్రాన్ని దాటి వస్త్రంలోపలి శరీరాన్ని, దాటి, అందులో ఉండే మనస్సుని, అదీ దాటి, అందులో వుండే జీవుడ్ని, అది కూడా దాటితే అందులో వుండే పరమాత్మకి ఈ 'నేను' అనే పేరు చెందాలి. కనుక కనిపించే అన్ని వస్తువులలో ఆ పరమాత్మ వుంటాడు. ఆ పేర్లతో చెప్పబడుతాడు. అలాగే నాలో వుంటాడు. 'నేను' అని చెప్పబడతాడు. కనుక "అసౌ" ఈ అర్చామూర్తిగా వున్నవాడు కానీ, "అసౌ" అటు సూర్యుడిలో వాడు కానీ, అహం = ఇటు నేను అని చెప్పబడేటటువంటి ఈ జీవుడికి లోపల వున్న పరమాత్మే కనుక, అస్మి = వాడే

నేనై ఉన్నాను. అనగా నాలో అంతరాత్మగా వుండి నేననే పేరుతో వ్యవహరింపజేస్తూకూడా నడిపిస్తున్నాడు. హే భగవన్! ఇక్కడ ఆత్మలో వుండే నిన్ను చూడలేను. బయట వుండే నిన్నుకాని నీదైన కాంతినికాని చూడలేను. ఎందుకూ చేతకా నివారము. కనుక నీ కాంతిని ఒక చోటకి చేర్చి విశ్వాసము కలిగేటట్లు అర్చామూర్తిగా మాకు సాక్షాత్కరించుము. అపుడు నేను నిన్ను సేవించగలుగుతాను. అపుడు నేను నిన్ను అర్చించ గలుగుతాను. అప్పుడే నా మనస్సుపై ఉండేటటువంటి అజ్ఞానపు పొర తొలగుతుంది. అనుగ్రహించుమా! అని ప్రార్థించు.

## 17వ మంత్రము :

వాయురనిల మమృతం - అథేదం భస్మాన్తం శరీరమ్।
ఓం క్రతో! స్మర, కృతం స్మర - క్రతో! స్మర కృతం స్మర॥

శరీరం అంటే ఏమిటి? ఆత్మ అంటే ఏమిటి? వీటితత్వం మాకు అవగతమైనదని భగవంతుడ్ని మనం ఇలా ప్రార్థన చేద్దాం అని తెలిసి చెబుతోంది.

వాయు = సంచరించునది; అని అర్థం. ఆత్మ ఎప్పుడూ ఒకచోట స్థిరముగా ఉండేది కాదు. ఎప్పుడూ సంచరిస్తూ ఉండేది. కనుక ఇది "అనిలం" అనికూడా పిలువబడుతుంది. అనిలం అంటే "స్థిరత లేనిది" అని అర్థం. కర్మానుసారము దేహంలోంచి దేహానికి మారతూవస్తోంది ఇంతకాలము విను గులేకుండా. కనుకనే ఆత్మ వాయు అనిలం కూడ. అసలు దీనియొక్క స్వరూపం ఎటువంటిది? ఇది ఎప్పుడూ కూడా "మృతి" అనేది లేనిది. ఇది "అమృతం". శ్వేతాశ్వతరమనే ఉపనిషత్తులో అమృతాక్షరం హరః 'అంటూ' ఆత్మకి అమృతం అని పేరు, అని తెలియచేస్తోంది. అదే ఇక్కడ కూడా, ఇది



అమృతం. ఏ రకమైనటువంటి దోషములు లేనటువంటి పరిశుద్ధమైనది, ఈ ఆత్మ. మరి పైనుండే, మనం చూసే ఈ శరీరమో? "అదః ఇదం శరీరమ్ భస్మాంతం" ఇది ఏనాడు అయితే ఆత్మచే వదలబడుతుందో ఆనాడు అగ్నితో చేరు తుంది, ఆనాడిది నశిస్తుంది. కనుక నశించేది దేహం. నశించనిది ఆత్మ. భగవంతుడ్ని మనం ప్రార్థన చేస్తాం. ఈ రెండింటికి నీవే నియంతవు కనుక నీవు ఓంకారం చేత చెప్పబడే వాడవు. నేనూ ఓంకారంతో చెప్పబడే వాడినే. నేను కూడా అమృతమే కదా! నీవు అమృతమే. కానీ నేను చిన్న అమృతం. నీవు పెద్ద అమృతం. ఓంకారంలో "అ, ఉ, మ" అని మూడు అక్షరములు వుంటాయి. 'అ' అక్షరాణామకారోస్మి 'అ' అంటే జగత్కారణమైన భగవానుడు. ఈతని వెనుక 24 తత్వాలుగ ప్రకృతి ఉంది. దానిపరిణామమే ఈ శరీరము. కనుక 'మ' అంటే శరీరంలో వున్నదానికంటే వేరైన జీవుడు అనవచ్చు. 'ఉ' ఈ జీవుడు పరమాత్మకే చెందినవాడు అని. పరమాత్మ ఎప్పుడూ జీవుడిని వీడి వుండని వాడని మనకి తెలియచేస్తోంది కనుక ఆత్మకి ప్రకృతికి కూడ నాథుడు అయినటువంటివాడు. 'ఓం' హే భగవన్! అంటే ఓంకారంతో చెప్పబడే వాడా! నీవు ఎలాంటి వాడవు? 'క్రతో' = నీకు 'క్రతు' అని పేరు. "అహం క్రతుః, అహం యజ్ఞః" అని నీవే చెప్పకున్నావు. అంటే ఎవరెవరు, ఏదేది కోరినా ఆ కోరికతో చేసినటువంటి కర్మకైనా 'ఫలితాన్ని' ఇచ్చేవాడవు నీవు. ఫలితం కోరిచేస్తే 'క్రతువు'. కోరక చేస్తే యజ్ఞం. నీవు క్రతువువి. నేను చేసే పనులు అన్నిటికీ ఏది ఫలితమో నీకు తెలుసును. మేము ఏమేమి చేశామో నీకు తెలుసును, కనుక, "క్రతో స్మర" మమ్మల్ని నీవు తలచుకో తప్ప, నిన్ను మేము తలవలేము. మేము నిన్ను తలచి నీ దగ్గరకు రావడం అనేది ఎప్పుడూ సాధ్యంకాదు. నువ్వు ఏనాడు అయినా మమ్మ తలచుకుంటేనే మేము ఉద్ధరించబడతాము.

అంతేకాదు "కృతం స్మర", కృతం = ఇంతవరకు నిన్ను, నేను పొందుటకు ఏమైన చేశానో లేదో తెలియదు. ఆ చేసినదేమిటో ఏంచేశానో నీకే బాగా తెలుసును, నాకంటే కూడా. కనుక నేను చేసిన వాటన్నిటికి కూడా "కృతం స్మర" ఒక్కసారి తలచుకోవయ్యా, నీపేరు "కృతజ్ఞుడు" కదా!

"కృతం జానాతి" ఏ కొద్దిగా చేసినా, దానిని బోలెడంతగా భావించి స్వీకరించే వాడివి నీవు. కనుక నీవు "కృతం స్మర" నేను చేసింది ఏ కొద్దిగా అయినా వుంటే దాన్ని మాత్రమే నీవు స్వీకరించి, నన్ననుగ్రహించు. అంతేకాదు 'కృతం' నువ్వు ఏదో చాలాచేశావు, నన్ను ఉద్ధరించేటందుకు. 'స్మర' దాన్ని కొంచెం గుర్తు పెట్టుకో. అంటే ఈ జీవుడ్ని కొన్ని యుగ యుగాల నుండి ఉద్ధరించుటకు ప్రయత్నం చేస్తున్నావు. కానీ నీకు చిక్కక నీకు నేను పారిపోతున్నాను. నాకోసం నీవెంత శ్రమపడ్డావో నీకు జ్ఞాపకం ఉండి వుంటుంది. నాకు జ్ఞాపకం లేదు. మరచిపోయి వుండవచ్చును. ఇంతవరకూ నేను నీకేసి తిరుగకపోవడం చేత, నీవు నావైపు తిరిగి, నిన్ను మళ్ళీ మళ్ళీ నాతోపాటు ఈ పాడు శరీరాల్లో ప్రవేశపెట్టుకుంటున్నావు. దానివలన పాపం! నీవు శ్రమపడుతున్నావు. కనుక హే భగవన్! "కృతం" నన్నుద్ధరించడం కోసం నీవు ఎన్ని శ్రమలు పడ్డావో, ఒక్కసారి జ్ఞాపకం పెట్టుకో, నీకు శ్రమ తగ్గించుటకు, ఈ వేళ నీకోసం తిరిగాను నీవైపు నేను. 'స్మర' కనుక ఇకపై నీవు శ్రమపడకుండా వుండాలంటే నన్ను ఉద్ధరించు. 'క్రతో స్మర కృతం స్మర', ఆదరం తోటి హే భగవన్, నీవు అన్నీ తెలిసిన వాడవు. కనుక నీవు నన్ను తలచుకో, హే భగవన్! నేను నీకేసి అనుకూలుడనై ఒక్కసారి తిరుగుతున్నాను. కనుక నన్ను స్మరించు. అంటూ 'వరాహ పురాణం' లో, గతంలో, భగవంతుడు ఒకసారి చెప్పాడు. ఎవడెవడైతే నాకేసి కొంచెం



మనస్సు పెడతాడో, వాడు తలచుకోలేనినాడు నేనే తలచు కుంటానని, నీవే కదా చెప్పావు ఒకనాడు? నీవన్నావు కదా ఆ మాట. కనుక 'స్మర' నన్ను తలచుకో. ఎవడైతే నీయందు కొద్దిగా బుద్ధి పెడతాడో వాడికి ప్రీతి తోటి కావలసినటువంటి పరికరాన్ని, జ్ఞానాన్ని ఇస్తానన్నావు. కనుక నిన్ను నేను స్మరిస్తు న్నానయ్యా ఒక్కసారి, నన్ను అనుగ్రహించు అని ప్రార్థించమని అని ఈశావాస్యోపనిషత్‌లోని 17వ మంత్రం చెబుతోంది.

### 18వ మంత్రము :

**అగ్నే! నయ సుపథా రాయే అస్మాన్**
**విశ్వాని దేవ! వయునాని విద్వాన్**
**యుయోధ్యస్మజ్జుహురాణ మేనః**
**భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ॥**

ప్రార్థన చేసిన మనని స్మరించుటకు, మనమేం చేశాం ఆయ నకి, ఏమైనా చేయాలి కదా కొంత. హే భగవన్! చేస్తున్నాను కొంత. నీకు చాలా యిష్టమైనది. నువ్వు చాలా గొప్పదని భావించేది ఏదైతే వుందో, అదే నేను చేస్తున్నాను. కనుక నాకు నీవు మోక్షం ప్రసాదించు. అంటే ఎపుడో చనిపోయిన తరవాతనా? కాదు. ఇక్కడ వున్నప్పుడు కూడా నేను పొందవ లసిన ఐశ్వర్యమును నాకు నీవు ప్రసాదించాలి. అర్థాత్, ఇక్క డున్నప్పుడు ఈ దేహంలో అనుభవించేటటువంటి, సౌఖ్యాలని, నీకు అనుకూలముగా వుండేటట్లుగా దేహాన్ని వదలిన తరు వాత చేరేస్థితిని, ప్రసాదించమని ఇదిగో ఈ రకమైన ప్రార్థన నీకోసం నేను చేస్తున్నానయ్యా అని ఈశావాస్యోపనిషత్‌లో చివరి మంత్రం సారాంశముగా ఒక ప్రార్థనని తెలియచేస్తోంది. ఇది యజ్ఞయాగాది క్రియలు చేసేటప్పుడు, అగ్ని ప్రార్థనగా అను సంధానం చేస్తారు.

'అగ్నే' అని మనం ప్రార్థన చేస్తాం భగవంతుడ్ని 'అగ్ని' లోకంలో మనకి కనిపించే "తేజః పదార్థం" అయితే దానికి ఆ తేజస్సు ఎక్కడినుండి వచ్చింది? దానిలోపల వ్యాపించి యున్న పరమాత్మచేత. కనుక అగ్నికి 'అంతర్యామి' గా మాకు సాక్షాత్కరించే ఓ తేజోరాశీ! అని మనం ఒక ప్రార్థన చేయవచ్చును. లేదా "అగ్రం నయతి" భగవంతుడికే అగ్ని అనిపేరు. తనని ఆశ్రయించిన ప్రతివాడిని 'అగ్రం' మరింత ఉన్నతికి 'నయతి' చేర్చును. కనుక 'అగ్ని' అంటే దానికి లోపల ఉండే భగవంతుడని మనం చెప్పకోనవసరం లేదు. స్వయంగా భగవంతుడికే అది ఒక శబ్దం. కనుక "హే అగ్నే', హే ఉద్ధరించువాడా, ఉజ్జీవింపచేయు పరమాత్మా!" "ఏం చేయాలి?" 'నయ' మమ్మల్ని అందరినీ పొందించు. ఎలా పొందించాలి ఎక్కడికి?. 'సుపథారాయే' 'సుపథా' మంచి మార్గంలో నడిపించు మమ్మల్నందర్నీను. ముళ్ళు, రాళ్ళు లేని సున్నితమైన మార్గములో మమ్మల్ని నడిపించు. దేనికి? 'రాయే', చక్కటి సంపద పొందుట కొరకు. ఏ సంపద? ఐహికమైనటువంటి సంపదలూ కావాలి. ఆంతరమైనటువంటి సంపదలూ కావాలి. ప్రాపంచిక సంపదలతో పాటు భగవత్ సంపదకూడా మాకు కావాలి. ఎవరిని నడిపించాలి? 'అస్మాన్' మమ్మల్ని అందర్నీను. మనం ప్రార్థన చేసేటప్పుడు ఎప్పుడూ నన్ను ఒక్కడ్నే అని ప్రార్థన చేయకూడదు. అది స్వార్థం అవుతుంది. కనుక 'అస్మాన్' మమ్మల్ని అందర్నీ కూడా నడిపించు. మన పెద్దలు, మన ఉపనిషత్తులు మనకి అందరితో కలిసి క్షేమాన్ని పొందాలి తప్ప ఒంటరిగా కాదు అని నేర్పుతున్నాయి ఈ మంత్రంలో. ఏమని ప్రార్థన చేయాలి? హే భగవన్! హే దేవా, నీవు ప్రకాశించువాడవు. ఈ జగత్తు అంతా నీకు ఆటభూమి. క్రీడాంగణము అంటాము దాన్ని. ఈ ప్రపంచము అంతా క్రీడాంగణముగ కలిగిన నీవు లోకంలో ఎన్నెన్నో, ఎన్నెన్నో మార్గములను చూపించి



వదరి పెట్టావు మమ్మల్ని. నడవమని. కానీ ఆ మార్గాలు ఎటు చేరుస్తాయో మాకు తెలియదు. ఏ మార్గంలో అడుగు పెడితే అది ఎటువైపు లాక్కుపోతుందో తెలియదు. అలాంటివి ఎన్ని వున్నాయి? 'విశ్వాని వయునాని' వయునము ఆశ్చర్యకరమైనటువంటి జ్ఞానమును నడిపించే మార్గము. ఉపాయము లేక సాధనము. అని అర్థం. ఎన్ని వున్నాయి అటువంటివి? 'విశ్వాని' బోలెడన్ని అనంతమైనన్ని ఉన్నాయి. అయితే చాలా వున్నాయి అని తెలిసిపోయింది కదానీకు? అంటే, భగవన్ నాకు తెలియదు. 'విద్వాన్ దేవ' నీవే వాటన్నిటి గురించి తెలిసినవాడివి తప్ప మేము వాటిని గురించి ఎటువంటి జ్ఞానమూ కలిగిన వాళ్ళం కాదు. అయితే ఏం చేస్తున్నాయి అవన్నీను? "జుహురాణం" అవన్నీ కూడా తమవైపు లాగివేస్తున్నాయి. అటువైపు మేము వాటిచేత లాగబడుతున్నాము. దానిచేత లాగబడి 'ఏనః' పాప ఆచరణ చేస్తున్నాము. అందుచేత నువ్వేం చేయాలంటే? వాటితోటి లాగబడి పాప ఆచరణ చేసేటటువంటి మమ్మల్ని నువ్వు అనుగ్రహించాలి. ఆ పాపం "అస్మత్ యుయోధి" మానుండి దూరం అయ్యేటట్లుగా చెయ్యి. ఈ లోకంలో ఎటువంటి ప్రాపంచికమైన ఆకర్షణలున్నాయో వాటియందు తగులుకొనేట్టుచేసేది, నిన్ను చేరుటకు ఆటంకముగా ఉండేటటువంటి, మాలో ఉండే అహంకారం ఉందే, అది మేము తొలగించుకుంటే, పోయేదికాదు. అదే పెద్ద పాపం అంటే. ఇతర పాపాలు, పాపాలు కావు. మనలో వుండే అహంకారం పెద్ద పాపం. కనుక 'అస్మత్' మానుండి 'యేనః' ఈ ఘోరమైనటువంటి పాపం ఐన అహంకారమును, "యుయోధి" దూరం చేయవయ్యా. అలాగే చేస్తాం. అయితే మీరు మాకేం చేస్తున్నారు, అని అడుగుతావేమో భగవన్, "భూయిష్ఠాంతే" నీకు ఏది ఇష్టమో అదికదా మేము నీకు చేయవలసినది. "నీ వుద్దేశంలో ఏది చాలా గొప్పది అనుకుంటావో అదికదా మేము

చేయవలసినది. నీకు గొప్పదనిపించదగినది, నీకు లేనిది, మాద గ్గరున్నది ఏమున్నదయ్యా?" వుందా అటువంటిది ఏదైనా, వాడి దగ్గరున్నది, మన దగ్గర లేనిది. వాడికి లభించనిది, మన మిస్తేనే వాడికి పూర్తయ్యేదని? ఏమీ లేనేలేదు. అసలన్నీ వాడివేకనుక. కానీ ఒక్కటుంది. ఏమిటది? "నమ ఉక్తిం విధేమ "నాలో వుండేటటువంటి "నాది నాది" అనే స్వార్థం ఉందే ఇది నీ వాటన్నిటినీ కబళీకరిస్తోంది. బలి చక్రవర్తి లాగ. పరమాత్మదైనటువంటి ప్రపంచమును నాది అనుకున్నాడు బలిచక్రవర్తి. పాపం! దోషి అయ్యాడు. పరమాత్మదైనటువంటి జీవుడ్ని స్వతంత్రుడను అనుకున్నాడు. దోషి అయ్యాడు. దోషం తొలగించుటకు పరమాత్మ ఆతనిని ఆక్రమించాడు. కనుక భగవన్, 'మః + న' "ఇవన్నీ కూడా నావి కావు". వాడు స్వతంత్రుడు కాడు. కనుక 'న-మః' అనగలగాలి భగవంతుని దగ్గర. నీవే ఉపాయము అనగలగాలి. ఈ మాట అనగలగటం చాలా కష్టం. ఇక్కడా తలవంగదు. మనకి ఆనందం అనుభవించేటప్పుడు అసలు తలవంగదు. హే భగవన్ పరమ పదం చేరిన తరువాత కూడా అక్కడ వుండే నిత్య ముక్త గణమంతా 'నమః నమః' అంటూ వుంటారది. అంటే భగవంతుడికి సేవచేసే ఆ స్థితిలోకి వెళ్ళిపోయిన తరువాత, నేను చేస్తున్నా, నాకిష్టమైనట్టు చేస్తున్నాననిపిస్తుందేమో, అలా కూడా అనిపించడం నీయొక్క సేవకి ఆటంకం కనుక, దాన్ని కూడా నీవు తొలగించాలి. అంటే 'సర్వాత్మనా' అతనికి అర్పించబడాలి. అప్పుడు పనిచేయాలి. అర్పించబడిపోయాము ఇక ఇచ్చేందుకు మా దగ్గరేమున్నది. అని చేతులు ముడుచుకు కూర్చొంటే కాదు. ఆత్మార్పణ భావంతోటి "కుర్వన్నేవ ఇహకర్మాణి జిజీవిషేత్" కర్మాచరణ చేస్తూకదా జీవించాలని చెప్పింది రెండవ మంత్రం. వాళ్ళు అక్కడ అలా చేస్తూవుంటారు. ఇక్కడ కూడా మేము అలా చేయగలగాలి. కనుక



భగవన్!, లోకంలో వుండే వాటన్నిటికీ, నువ్వు చాలా ఇష్టపడేది, మేము నీకు చెంది ఉండటం. దానికి ఆటంకం మా అహంకారం. దానిని నీకు అర్పిస్తున్నానయ్యా. అది అర్పించడం చాలా గొప్పదని నీవు భావిస్తావు. ఇది అర్పించకపోతే నీ వస్తువు నీకు దూరం అయిపోయిందని నీవు శోకిస్తావు. కనుక నీ వస్తువు నీదిగా అయ్యేట్టు ఇప్పటిదాకా నాలో వుండే స్వార్థాన్ని అహంకారాన్ని, డంబాన్ని నీ కర్పిస్తే నీవు పొంగిపోతావు. కనుక 'భూయిష్ఠాంతే' నీ దృష్టిలో చాలా గొప్పది అనిపించేటటువంటి 'నమ ఉక్తిం విధేమ' 'నమ' అనేటటువంటి మాటని పలుకుతాము. మనస్సుతోటి అంటున్నామా లేదా అని నీవు మనస్సులోకి చూస్తావేమో. మనస్సు మళ్ళీ నీవు చెప్పినట్టు వింటుందో లేదో నేను అర్పించమన్నట్టు మళ్ళీ అర్పిస్తుందో లేదో తెలియదు. నోటికి అయితే మాట వచ్చును కనుక "నమ ఉక్తిం విధేమ" అందమైన మాట మాత్రం అనేస్తాం. ఇది భగవంతుడి యొక్క స్వరూపం. శిక్షించాలంటే, మనస్సు లోపలి దాకా చూసి ఎక్కడా ఒక అనుకూల భావం లేదనిపిస్తే తప్ప శిక్షించడు. రావణాసురుని చూసినట్లుగ. కానీ రక్షించాలంటేనో?, లోపల చూడనే చూడడు, చేతులు ఎత్తేవో లేదో కూడా చూడడు. తన దాకా మాట వచ్చిందో లేదో వింటాడు. 'ఓం నమః' అన్నారంటే 'మిత్రభావేన', మనస్సులో వద్దు. అబద్ధాలకు అయినా నోటితో ఒక మాట అను. చాలు అనుకుంటాడుట. ద్రౌపది అలా అన్నది. రక్షించాడు అని మనకి చరిత్ర చెబుతోంది. కనుక భగవన్ 'నమః' అనేటటువంటి మాటని ఇదిగో మేమునీకు అర్పిస్తున్నాం. కనుక మేము మంచి సంపదలు పొందుటకు మంచి ఉపాయమేదో ఆలోచించి దాన్ని మాకు ప్రసాదించు. అందులో మమ్మల్ని నడిపించు. అందులో మమ్మల్ని సుఖింపచేయి. అని ఈశావాస్యోపనిషత్‌లో 18 వ మంత్రంలో ఇహలోకంలో కూడా సౌఖ్యాలు

పొందవచ్చును. దానికి మనం చేయవలసినది భగవంతుని దగ్గర మన అహంకారమును, స్వార్థాన్ని అర్పించగలిగితే చాలును. ఆ భగవంతుడు జగత్తు అంతా వ్యాపించిన వాడు. బయట, లోపల కూడా. దీన్నంతటినీ ఆచ్ఛాదించుకొని తన ఇష్టమునకు తగిన ట్టుగా వాడుకునేవాడు. వాని యొక్క సేవగా నీ జీవితం గడుపు. వాని యొక్క సేవలుగా నీవాచరించే కర్మలని ఆచరించు, తప్ప, వాడిదైన ఈ వస్తువుని నాది అనుకుంటూ నువ్వు చౌర్యాన్ని నీ మీద ఆరోపించుకోకోయ్ కనుక ఇపుడు అనుభవించు జీవితంలో వాడిచ్చిన వాటన్నిటినీ. కర్మ త్యాగంచేయకు. భావత్యాగం చేస్తూ ఆచరించే కర్మయే నీ జీవితానికి పరమ లక్ష్యం సుమా! అని ఉపదేశం చేస్తోంది.

సర్వం శ్రీకృష్ణార్పణ మస్తు.

* * * * *

జై శ్రీమన్నారాయణ!
ప్రామాణికమైన వేదాంత విషయాలు తెలుసుకోండి
ఆధ్యాత్మిక సందేహములా ?
సరైన సమాధానములు పొందండి.
అందమైన ఆచరణ పద్ధతులను నేర్చుకోండి.
ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోండి.
మన వారందరికీ తెలియజేయండి.
భక్తితో నివేదిస్తున్న మంచి పలుకుల నాలకించండి.
భక్తి నివేదనను చదవండి.

# భక్తి నివేదన

వేదాంత మాస పత్రిక

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్
సీతానగరం, గుంటూరు జిల్లా - 522 501.
✆ : 0866 - 426929, 424053.
E-Mail : Jethyd@hd1.vsnl.net.in
Internet : www.chinnajeeyar.org

సంవత్సర చందా : రూ. 50.00
శాశ్వత చందా : రూ. 500.00
USA $ 50
సహాయ చందా : మీ అభిమానం